గురువారం
30-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 38
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బలూచిస్థాన్‌లో పాక్ వైమానిక దాడులు

ఇస్లామాబాద్: ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ పేరుతో బలోచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) లక్ష్యంగా అర్ధరాత్రివేళ పాకిస్థాన్ మరోసారి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో దాదాపు 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. బలూచిస్థాన్‌లోని చిల్తాన్ పర్వత ప్రాంతంలో బీఎల్ఏ ఉగ్రవాదులే లక్ష్యంగా పాక్ బలగాలు కచ్చితమైన వైమానిక దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు చాలా రోజులుగా తమ నిఘాలో ఉన్నారని పాక్ పేర్కొంది. తాజా దాడులతో ఉగ్రవాదులకు సంబంధించిన అనేక తాత్కాలిక రహస్య స్థావరాలు పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఆ ప్రావిన్స్‌లోని భద్రతా కాన్వాయ్‌లు, మౌలిక సదుపాయాలపైనా దాడులు జరిగినట్లు మీడియా కథనాలు తెలిపాయి.

రఫేల్‌లో రాష్ట్రపతి గగన విహారం

న్యూఢిల్లీ: రాష్ట్రపతి, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి ఆమె రఫేల్‌లో ప్రయాణించారు. వాయుసేన చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. రఫేల్‌లో ప్రయాణానికి ముందు రాష్ట్రపతి సైనిక వందనం స్వీకరించారు. దాదాపు 30 నిమిషాల పాటు ఆమె గగన విహారం చేశారు. ఈ ఏడాది మేలో పాకిస్థాన్‌పై భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్'లో రఫేల్ యుద్ధవిమానాలు కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. వీటి

- మిగతా 2 లో

పీజీ మెడికల్ కోర్సుల షెడ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీజీ మెడికల్ (ఇన్‌సర్వీసెస్, నాన్ సర్వీసెస్), డిప్లొమో కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరంకిగాను డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ షెడ్యూలు జారీజేసింది. అండర్ కాంపిటేటివ్ అథారిటీ కోటా కింద అభ్యర్థులు ఈనెల 31వ తేదీ రాత్రి 7 గంటల లోగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ

- మిగతా 2 లో



కృష్ణాజలాలపై మరోసారి వాదనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణాజలాల పంపిణీ నూతన విధివిధానాలపై కృష్ణా ట్రిబ్యునల్‌లో మరోసారి ఏపీ వాదనలు వినిపించింది. కృష్ణాజలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం జారీజేసిన గెజిట్‌ను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించిన విషయం విదితమే. దీనిపై తాజాగా వాదోపవాదాలు కొనసాగాయి. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణాజలాల పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం నొక్కిచెప్పింది. దీనిపై సుప్రీంకోర్టులో తమ పిటిషన్ పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది. బచావత్ ట్రిబ్యునల్ నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను ఏపీ తరపున న్యాయవాది గుప్తా వివరించారు. తదుపరి విచారణ నవంబరు 25, 26, 27 తేదీలకు వాయిదా పడింది.

ప్రతిభపై విశ్వాసం... పాలనపై నమ్మకానికి

మెక్ డొనాల్డ్ ప్రతీక

చారిత్రక నగరం నుంచి గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్

వృద్ధి... సమష్టి అభివృద్ధి ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలు: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ ప్రతిభపై విశ్వాసం... పాలనపై నమ్మకానికి మెక్ డొనాల్డ్ గ్లోబల్ కార్యాలయం ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి టీ హబ్ సమీపంలో మెక్ డొనాల్డ్ గ్లోబల్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ జీసీసీలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని తెలిపారు. 1940లలో మెక్ డొనాల్డ్ ప్రారంభమైనప్పుడు, అది కేవలం ఆహారం గురించి మాత్రమే కాదు... పరిమాణం, సామర్థ్యం... అనుసంధానమైన ప్రపంచం అనే భావనకు ప్రతీకగా నిలిచింది అన్నారు. హైదరాబాద్ చారిత్రక నగరం నుంచి డేటా, డిజైన్, గ్లోబల్ హబ్‌గా ఎదిగింది అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టి పెట్టుబడి వల్లే హైదరాబాద్‌కు స్థిరమైన బలం చేకూరింది అన్నారు. సీసీఎంబి హైదరాబాద్ విశ్వవిద్యాలయం, బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్ ఇలా... అన్నీ కూడా నెహ్రూ స్ఫూర్తి నుంచి పుట్టినవే అని గుర్తు చేశారు. సమానత్వంతో కూడిన వృద్ధి, సమష్టి అభివృద్ధి అనే అంశాలు తెలంగాణ ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలు అని డిప్యూటీ సీఎం తెలిపారు. మెక్ డొనాల్డ్ తెలంగాణ యువత కోసం నైపుణ్యాభివృద్ధి...ఉపాధి అవకాశాలపై భాగస్వామి కాబోతుందన్న విషయం తెలంగాణ ప్రజానీకానికి ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధికి మానవీయ కోణం ఉండాలి అని తెలిపారు. మెక్ డొనాల్డ్ సెంటర్ ... భారత విశ్వాసానికి, తెలంగాణ ప్రతిభకు, గ్లోబల్ సంస్థలు, స్థానిక ప్రతిభ కలయికతో సృష్టించగల అద్భుతానికి ప్రతీక అని అభివర్ణించారు. హైదరాబాద్ మీ కార్యాలయం మాత్రమే కాదు, మీ భాగస్వామి కూడా అని కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం అన్నారు. డొనాల్డ్ కంపెనీ ప్రతినిధులు మిస్ స్కై ఆండర్సన్, దేశాంత్ కైలా, మ్యాటిజ్ బ్యాక్స్, స్పీరో ద్రూలియాస్, శదాస్ దాస్‌గుప్తా పాల్గొన్నారు.

ఓవర్సీస్ స్కాలర్షిప్ బకాయిలు రూ.303 కోట్లు విడుదలకు ఆదేశం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్

- మిగతా 2 లో

మొంథా విధ్వంసం

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు | **నేలకొరిగిన పంటలు** | **లోతట్టు ప్రాంతాలు జలమయం**

- ప్రజాజీవనం అస్తవ్యస్తం
- తడిచి ముద్దయిన భాగ్యనగరం
- ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ
- వాహనదారుల ఇక్కట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్/ ఖమ్మం/ కొణిజర్ల: మొంథా తుపాను ప్రభావం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా తెలంగాణ తడిచి ముద్దయింది. ఎడతెరిపి లేకుండా మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వివిధ ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వివిధ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ జిల్లాల్లో పంటలు నీటమునిగాయి. పంటపొలాల్లో వర్షపునీరు చేరడంతో చేతికి వచ్చిన పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు నేలకొరిగాయి. భారీగా పంట నష్టం ఏర్పడింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతాంగం వేడుకొంటోంది. తుపాను విజృంభణతో హైదరాబాద్ తడచిముద్దయింది. జూబ్లీహిల్స్,

- మిగతా 2 లో

సమన్వయంతో పనిచేయండి

- అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించండి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

2 లో

సీపీఐ శతవసంతాల సభ

ఖమ్మంకు దండుగా కదులుదాం

- వేడుకగా కాకుండా ఉద్యమ చరిత్ర తెలియజెప్పేదిలా ఉండాలి
- పార్టీ శ్రేణులకు కూనంనేని దిశానిర్దేశం

విశాలాంధ్ర - కొత్తగూడెం: సీపీఐ వందేళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే శతవసంతాల ముగింపు సభకు ప్రతి పల్లె, బస్తీ నుంచి దండుగా భారీగా కదిలి రావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో బుధవారం కొత్తగూడెం పట్టణ కౌన్సిల్ సమావేశం మర్రి గోపి కృష్ణ, మాచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... సీపీఐ శతవసంతాల ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకగా కాకుండా, ప్రజల ఉద్యమ చరిత్రను గుర్తు చేసే చరిత్ర గమనంలా ఉండాలన్నారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం పోరాడిన సీపీఐ చరిత్ర నేటితరానికి ఆదర్శనంగా ఉండేలా మండల, గ్రామ స్థాయిలో ఉత్సావాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు వందేళ్ల ఉత్సావాలకు తరలివచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్మికులు, కూలీలు, రైతులు, ఉద్యోగులు, యువత, మహిళల సమస్యలపై విస్తృత చర్చలు, సదస్సులు, ర్యాలీల ద్వారా ప్రజా చైతన్యం పెంచాలని సూచించారు. ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో ఎర్రజెండా ఎగురవేయాలని అన్నారు. పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, జిల్లా నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, గెద్దాడు నగేష్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అప్రమత్తంగా వ్యవహరిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావంతో భద్రాది

- మిగతా 2 లో

జస్టిస్ సుబేందు సామంత ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుబేందు సామంత ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ సుబేందుతో నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జస్టిస్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కలకత్తా హైకోర్టు నుండి జస్టిస్ సుబేందు ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

- రుణమాఫీ హామీ అమలు పట్టదా
- మహారాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం
- వేలాది మంది భారీ ప్రదర్శన
- జాతీయ రహదారి దిగ్బంధం-రైల్ రోకో

ముంబై: ఇచ్చిన హామీల అమలు విషయాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తుండటంపై మహారాష్ట్ర రైతన్నలు గర్జించారు. వీధి పోరాటాన్ని చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల గొంతు నొక్కేయలేరంటూ తేల్చిచెప్పారు. పూర్తిస్థాయిలో రుణ మాఫీ కోసం ప్రధానంగా డిమాండ్ చేస్తూ బుధవారం నాగపూర్-హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 44)ను అన్నదాతలు దిగ్బంధించారు. రైల్వే పట్టాలపై బైఠాయించి రైల్ రోకో నిర్వహించారు. 'రైతుల హక్కులు మా జన్మహక్కు, సంపూర్ణ రుణ మాఫీ జరిగేంత వరకు విశ్రమించబోం' అన్న నినాదాలు, ప్లకార్డులతో కదం తొక్కారు. హామీల అమలులో పాలకుల వైఫల్యాన్ని ఎండగట్టారు. మాజీ శాసనసభ్యుడు, కార్యకర్త బచ్చు కదు నాయకత్వంలో అమరావతి నుంచి నాగపూర్ వరకు 'మహా ఎల్గార్ మోర్చా' జరిగింది. ప్రభుత్వంపై రైతుల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కాంగ్రెస్‌కు పట్టని రైతన్న గోస

- నేలమట్టం తప్ప ఇల్లు కట్టింది లేదు
- మున్నూరు కాపులకు సముచిత గౌరవం ఘనత కేసీఆర్‌దే
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీకి బుద్ధిచెప్పండి: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో పాలన పడకేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదని చెప్పారు. అన్నదాతలకు బోనస్, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు కూడా అందట్లేదని అన్నారు. రూ.73 వేల కోట్లు రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో జమచేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. రైతుల గోస కాంగ్రెస్ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతులకు స్కూటీ, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ ... మాట తప్పిందన్నారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటూ ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా... వేలాది ఇళ్లను నేలమట్టం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. మున్నూరు కాపులకు సముచిత గౌరవం, సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. 42 శాతం

- మిగతా 2 లో

ఏపీలో తీవ్ర నష్టం

- ఏపీ వ్యాప్తంగా 18 లక్షల మందిపై తుపాను ప్రభావం
- తీర ప్రాంత జిల్లాలు కకావికలం
- రైతన్నను కోలుకోలేని దెబ్బతీసిన మొంథా
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు ఏరియల్ సర్వే

2 లో

వెనక్కి మళ్లిన రష్యా చమురు ట్యాంకర్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించడంతో రష్యా నుంచి భారత్‌కు జరుగుతోన్న చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు కనిపిస్తోంది. ఆ దేశ ముడిచమురుతో భారత్ వైపు వస్తోన్న ట్యాంకర్ మార్గమధ్యలో యూటర్న్ తీసుకుంది. బాల్టిక్ సముద్రంలో నిలిచిపోయింది. డెన్మార్క్, జర్మనీ మధ్య ఉన్న జలసంధిలో పశ్చిమం వైపుగా వెళ్తున్న ఒక ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వెనక్కి మళ్లింది. కొంతదూరం వెళ్లిన తర్వాత నెమ్మదించిందని షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్‌ఎంఈఎల్ సంస్థ అధికారులు రష్యా చమురు కొనుగోలు చేశారు. ఈ రిఫైనరీ... హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మిత్తల్ గ్రూప్ భాగస్వామ్యంలో నడుస్తోంది. ఆర్సెలార్ మిత్తల్‌కు చెందిన ఎనర్జీ విభాగం ఆంక్షల పరిధిలో ఉన్న నౌకల ద్వారా ముడి చమురును గుజరాత్‌లోని ముంద్రా నౌకాశ్రయానికి దిగుమతి చేసుకొని అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పంజాబ్‌లోని గురుగోవింద్ సింగ్ రిఫైనరీకి సరఫరా చేసినట్లు ఆంగ్ల పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెల్లడించింది. ఇది దేశంలోనే పదో అతిపెద్ద రిఫైనరీ. ఏడాదికి 11.3 మిలియన్ టన్నుల ముడిచమురును ప్రాసెస్ చేస్తుంది. 'జులై-సెప్టెంబర్ మధ్యలో ముర్మాన్స్క్‌లోని ఆర్కిటిక్ పోర్ట్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికా ఆంక్షల జాబితాలో ఉన్న నౌకల్లో చమురు రవాణా అయింది. ఈ రవాణాను కప్పిపుచ్చుకునేందుకు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయి' అని మీడియా కథనం పేర్కొంది. షిప్పింగ్ డేటా, కస్టమ్స్ రికార్డులు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. ఈ నౌకల్లో రవాణాను ఎవరు ఏర్పాటు చేశారనేది మాత్రం తెలియదని వెల్లడించింది. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న ట్రంప్ సర్కారు నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. గతంలోనూ రష్యాపై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ... ఈసారి వాటి తీవ్రత ఎక్కువగా ఉంది.

నేను చెబితేనే యుద్ధం ఆగింది

వాణిజ్యం ఆపుతానని బెదిరించా

మోదీ, షెహబాజ్ తెలివైన వారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

సియోల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసియా పర్యటనలో ఉన్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా మలేసియా, జపాన్‌లో పర్యటించారు. ప్రస్తుతం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోదీపై ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పొగుడుతున్నారో... తిడుతున్నారో తెలియకుండా నర్మగర్భంగా ట్రంప్ వ్యాఖ్యలు కనిపిస్తున్నాయి. భారత్-పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా మోదీతో ట్రంప్ జరిపిన సంభాషణను గుర్తు చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో భారతదేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ అంటే గొప్ప గౌరవం, ప్రేమ ఉందని చెప్పుకొచ్చారు. మోదీతో గొప్ప సంబంధం ఉందన్నారు. అలాగే పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా గొప్ప వ్యక్తి అని, షరీఫ్‌కు ఫీల్డ్ మార్షల్ కూడా ఉన్నారని, అతడు గొప్ప పోరాట యోధుడు అయినందున ఫీల్డ్ మార్షల్ అయ్యాడని కొనియాడారు. వీళ్లందరూ తనకు బాగా తెలుసు అన్నారు. యుద్ధ సమయంలో ఏడు విమానాలు కూలిపోయినట్లు విన్నానని, ఆ రెండు అణ్వస్త్ర దేశాలని, ఆ సమయంలో నిజంగా దాని కోసం ప్రయత్నించారని తెలిపారు. 'ఆ సమయంలో మోదీకి ఫోన్ చేశాను. ఇలాగైతే మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోలేమని చెప్పాను. చేసుకోవాలని మోదీ అడిగారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తే చేయబోనని చెప్పేశాను.

అనంతరం పాకిస్థాన్ ప్రధానికి కూడా ఫోన్ చేసి మీరు భారతదేశంతో యుద్ధం చేస్తే వాణిజ్య ఒప్పందం చేసుకోబోనని అన్నాను. మమ్మల్ని పోరాడనివ్వండి అని అడిగారు. రెండు దేశాల నేతలు అలాగే అన్నారు. ఇద్దరూ బలమైన వ్యక్తులు' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. 'ప్రధాని మోదీ చాలా అందంగా కనిపించే వ్యక్తి. కానీ ఆయన హంతకుడు. చాలా కఠినుడు. మేము పోరాడతాం అన్నారు. ఆయన మనకు తెలిసిన వ్యక్తేనా అని అడిగాను. అక్షరాలా రెండు రోజుల తర్వాత వారే ఫోన్ చేసి మేము అర్థం చేసుకున్నామని మోదీ చెప్పారు. రెండు రోజుల తర్వాత యుద్ధం మానేశారు. ఇది అద్భుతం కాదా? బైడెన్ ఎప్పుడైనా ఇలా చేశాడా? అలా చేశాడని నేను అనుకోను' అంటూ ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన ఎపిసోడ్‌ను గుర్తుచేసుకుంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.

క్లౌడ్ సీడింగ్ సరే... వర్షాలేవి: ఆప్

న్యూఢిల్లీ: క్లౌడ్ సీడింగ్ ప్రక్రియపై ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసింది. కృత్రిమ వర్షం కురుస్తుందని వాదించినప్పటికీ... వర్షపాతం నమోదు కాలేదని, ఢిల్లీలో ఇటువంటి ప్రయోగాల సాధ్యాసాధ్యాలపై సందేహాలు లేవనెత్తుతున్నాయని పేర్కొంది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా క్లౌడ్ సీడింగ్ జరుగుతోందని, కానీ ఎక్కడా వర్షం కురవడం లేదని ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ బుధవారం మీడియా సమావేశంలో తెలిపారు. వాతావరణ, రసాయన కారకాల కారణంగా ఢిల్లీ వాతావరణానికి క్లౌడ్ సీడింగ్ తగినది కాదని మూడు కేంద్ర ప్రభుత్వ సంస్థలు గతంలో పార్లమెంటులో వెల్లడించాయని ఉద్ఘాటించారు. ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్ చేయలేమని ఈ సంస్థలు ఇప్పటికే ప్రకటించినప్పటికీ... ఇప్పుడు ఇటువంటి ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

పీజీ మెడికల్ కోర్సుల షెడ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

మేరకు రిజిస్ట్రార్ బి.రాధికారెడ్డి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

ఎన్‌సీసీ కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలు

ఎన్‌సీసీ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ డిగ్రీలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు స్వీకరిస్తోంది. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేయాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌కు పట్టని రైతన్న గోస

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు ఇస్తామంటూ బీసీలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా ఈ నెల 31న షేక్‌పేట్, నవంబరు ఒకటో తేదీన రెహమత్ నగర్, రెండున యూసుఫ్‌గూడ, మూడున బోరబండ, నాలుగున సోమాజిగూడ, ఐదున వెంగళరావు నగర్, నారున ఎర్రగడ్డ , ఎనిమిదిన షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, రెహమత్ నగర్ డివిజన్లలో రోడ్ షో నిర్వహిస్తారు. తొమ్మిదిన షేక్‌పేట్ నుంచి బోరబండ వరకు నిర్వహించే బైక్ ర్యాలీతో ప్రచారం ముగుస్తుంది.

'మెక్ డొనాల్డ్' ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

బకాయిలు రూ.303 కోట్లు వెంటనే విడుదల చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. 2022 నుంచి ఉన్న బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పై విదేశాలకు వెళ్లారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందకపోవడంతో వారి తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ భారం పెరుగుతుంది. ఈ పరిస్థితిలన్నింటిని అవగాహన చేసుకున్న డిప్యూటీ సీఎం... దీన్ని ప్రాధాన్యత అంశంగా భావించి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవలు అందించే అవకాశం కలుగుతుందన్న ఆశాభావంతో ఉన్నట్టు ఓవర్సీస్ విద్యార్థులు తెలిపారు.

ఖమ్మంకు దండుగా కదులుదాం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. బుధవారం మున్సిపల్, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, వ్యవసాయ, ప్రజారోగ్య, విద్యుత్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా వివిధ సూచనలు చేశారు. భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నందున నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భారీ వర్షాలతో ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్న లోతట్టు ప్రాంత ప్రజలను, నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సహాయక చర్యల్లో ముమ్మరంగా పాల్గొని ప్రజలకు వెన్ను దన్నుగా ఉండాలని కోరారు. ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దని సూచించారు.

రఫేల్‌లో రాష్ట్రపతి గగన విహారం

(మొదటిపేజీ తరువాయి)

సాయంతో నాడు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడులు చేసింది. ఈ యుద్ధ విమానంలో ఇప్పుడు ముర్ము గగనవిహారం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 మే 8న ద్రౌపదీ ముర్ము అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించారు. ఈ ప్రయాణం చేసిన రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె గుర్తింపు సాధించారు. అంతకుముందు 2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ఇదే యుద్ధవిమానంలో గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పూణె వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్-30 యుద్ధ విమానంలో విహరించారు.

'మొంథా' విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

మాదాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లిలో కుండపోతగా వర్షం కురిసింది.. నగరంలోని ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, నాగోల్ రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. ఆఫీసులకు వెళ్లే సమయం కావడంతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర అవస్థలు తప్పలేదు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. గురువారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తూ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన అతి భారీ వర్షాలు కురిసాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి, జగిత్యాల జిల్లాలతో పాటు రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.

వరద నీటిలో వరంగల్ రైల్వే స్టేషన్

వరంగల్ రైల్వే స్టేషన్‌ను వరద నీరు ముంచెత్తింది. ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. బెజవాడ చేరుకోవాల్సిన కొందరు ప్రయాణికులు హైదరాబాద్ తిరుగుపయనమయ్యారు. రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మోటార్ల సహాయంతో వరద నీటిని బయటకు పంపించారు. పట్టణంలో వివిధ ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. వాహనదారులు, ప్రజల ఇక్కట్లు వర్ణణాతీతం.

నిమ్మవాగులో కొట్టుకుపోయిన వ్యాన్... డ్రైవర్ గల్లంతు

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద నిమ్మవాగులో వరద ఉధృతికి డీసీఎం వ్యాన్ కొట్టుకుపోయి డ్రైవర్ గల్లంతయ్యాడు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి నిమ్మ వాగు, తీగల బంజర, పగిడేరు వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట సమీపంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన వెంకట ముత్యం అలియాస్ పెద్దోడుకు చెందిన డీసీఎం వ్యాను జూలూరుపాడుకి పత్తిలోడుకు వెళ్లి తిరిగి వస్తుండగా వాగులో కొట్టుకుపోయింది. డ్రైవర్ మురళి... వ్యాన్ కొట్టుకుపోకుండా కొద్దిసేపు నియంత్రించినా... వరద ఉధృతి తీవ్రంగా పెరగటంతో వాగులో వ్యాన్ కొట్టుకుపోయింది. డ్రైవర్ కిందకు దిగక పోవడంతో అతడు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులకు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.

ఘటనా స్థలం సీపీ పరిశీలన

నిమ్మవాగులో వ్యాన్‌తో సహా డ్రైవర్ గల్లంతైన విషయాన్ని తెలుసుకున్న కంభం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆ వాగు ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరస్థాయిలో వాగు ప్రవహిస్తుందని, ఎవరూ వాగు దాటవద్దని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

రోడ్డెక్కిన రైతులు

(మొదటిపేజీ తరువాయి)

అసహనానికి, సమస్యల పరిష్కారానికి వారి సంకల్పానికి అద్దం పట్టింది. బచ్చు కదు మాట్లాడుతూ 'మా సహనానికి పరీక్ష పెట్టొద్దు. ఇచ్చిన హామీలను అమలు చేయలేదంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుంది' అని హెచ్చరించారు. చాలా రోజులుగా రుణ మాఫీ సహా ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు, వినతుల సమర్పణ తదితర రూపాల్లో రైతులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, దివ్యాంగులు, మత్స్యకారులు, పశువుల కాపరులు ఈ ర్యాలీలో పాల్గొనడం ద్వారా నాగపూర్‌లో చరిత్ర సృష్టించారని బచ్చు కదు అన్నారు. 'ఇది కొందరి కోసం జరిగే పోరాటం కాదు... యావత్ మహారాష్ట్ర కోసం జరుగుతోంది' అని నొక్కిచెప్పారు. రైతులకు పూర్తి రుణ మాఫీ, వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు, దివ్యాంగులకు గౌరవ ప్రోత్సాహకాలు, పశుకాపరులు, మత్సకారులకు న్యాయమైన హక్కులు తదితర డిమాండ్ల పరిష్కారానికి డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి వామపక్ష నాయకులు అనిత్ నవాలే, మహాదేవ్ జంకర్, రాజు శెత్తి మహాదేవ్‌తో పాటు స్వాభిమానీ శేట్కర్ సంఘటన నాయకుడు రాజు శెట్టి, మాజీ ఎమ్మెల్యే వామనరావు ఛాపత్ మద్దతు ప్రకటించారు. రైతుల ప్రదర్శనతో నాగపూర్ నగరం స్తంభించిపోయింది. కొన్ని గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని రైతు సంఘాల భాగస్వామ్యంతో రాబోయే రోజుల్లో పోరు మరింత ఉధృతం కాబోతోందన్న సందేశాన్ని ఈ ర్యాలీ ఇచ్చింది.

సమన్వయంతో పనిచేయండి

- లోతట్టు ప్రాంత ప్రజలను సహాయక శిబిరాలకు తరలించండి
- అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు: అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

విశాలాంధ్ర - హైదరాబాద్: మొంథా తుపాను విజృంభిస్తున్న తరుణంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో తుపాను ప్రభావంపై సీఎం బుధవారం ఆరా తీశారు. వరి కోతల సమయం... వివిధచోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో అధికంగా ఉండడం... హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం...వివిధ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారి మళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సీఎం సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని సీఎం ఆదేశించారు. దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. వైద్యారోగ్య శాఖ మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

12 రాష్ట్రాలు... కేంద్రపాలిత ప్రాంతాల్లో

మరిన్ని పోలింగ్ కేంద్రాలు

న్యూఢిల్లీ: ఓటింగ్ క్యూలను తగ్గించేందుకు వచ్చే వారం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వెళుతున్న 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇప్పటికే ముగిసిన బీహార్, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,500 మంది ఓటర్లు ఉన్న దేశంలోనే మొదటి రాష్ట్రంగా అవతరించింది. హేతుబద్ధీకరణ ప్రక్రియ అంటే 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. బీహార్ తరహాలో ఇక్కడ ఆ సంఖ్య గతంలో 77,895 నుంచి 90,712 కు పెరిగింది. హేతుబద్ధీకరణ అంటే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తమ వంతు కోసం వేచి ఉన్నప్పుడు తక్కువ సమయం క్యూలలో ఉండటమే. నవంబరు 4న ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమయ్యే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు దాని సూచనల ప్రకారం... ఎత్తయిన భవనాలు, నివాస సంక్షేమ సంఘాలు ఉన్న కాలనీలు, మురికివాడల సమూహాలలో కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంపై జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీలను సంప్రదిస్తారు. ఒకే కుటుంబంలోని సభ్యులందరినీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉంచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈసీ ఆదేశించింది.

ఏపీలో తీవ్ర నష్టం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మొంథా తుపాను నిండా ముంచేసింది. జిల్లాలకు జిల్లాలను తుడిచిపెట్టింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మరికొద్ది రోజుల్లో చేతికందుతుందని ఎదురుచూస్తున్న సమయంలో రైతన్నను మొంథా కోలుకోలేని దెబ్బతీసింది. మాగాణి, మెట్ట, ఉద్యానవన పంటలన్నీ తుపాను దెబ్బకు సర్వనాశనమయ్యాయి. కంకి, పొట్ట దశలో ఉన్న వేలాది ఎకరాల వరి నీట మునిగింది. మరోపక్క తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో వీచిన భీకర గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. తీర ప్రాంతంలో రాకాసి అలలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. ఇంకోవైపు తుపాను ప్రభావానికి కురిసిన భారీ వర్షాలతో నదులు, చెరువులు ఉప్పొంగి గ్రామాలను వరదలు ముంచెత్తాయి. రోడ్లకు గండ్లు పడి అనేక గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి. మొత్తానికి కోస్తా అంతటా ఎటుచూసినా కూలిన ఇళ్లు, చెట్లు, విద్యుత్ స్థంభాలు, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు వంటి బీభత్స దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వానికి కూడా అంచనాలకందనంత నష్టాన్ని, కష్టాన్ని ప్రజలకు మొంథా మిగిల్చి వెళ్లింది. తుపాను ధాటికి విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, నంద్యాల జిల్లాలు కకావికలమయ్యాయి. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుపాను ప్రభావం చూపింది. 304 మండలాల పరిధిలోని 1,825 గ్రామాల్లో 87 వేలహెక్టార్ల పంట దెబ్బతింది. సుమారు 59 వేలకు పైగా హెక్టార్లలో వరి పంట, పత్తి, మొక్కజొన్న, మినుము పంటలు నీటమునిగాయి. ఫలితంగా 78,796 మంది రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. తుపాను గాలులు, భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 42 పశువులు మృత్యువాతపడ్డాయి. పంటల తర్వాత రహదారులకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. మొత్తం 2,294 కిలోమీటర్ల పొడవునా ఆర్ అండ్ బీ రహదారులు ధ్వంసమయ్యాయి. కేవలం ఈ రోడ్లకే రూ.1,424 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. గ్రామీణ నీటి సరఫరాకు సంబంధించి రూ.36 కోట్లు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. అధికారుల ముందు జాగ్రత్త చర్యల ఫలితంగా ప్రాణ నష్టాన్ని నివారించారు. చలిగాలుల తీవ్రతకు అద్దంకి నియోజకవర్గంలో మాత్రం ఇద్దరు మృత్యువాతపడ్డారు. 3,175 మంది గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 2,130 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి... ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించారు. భారీ వర్షాల కారణంగా 297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, ఆయా ప్రాంతాల్లో దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ యుద్ధప్రాతిపదికన పొక్లెయిన్లతో తొలగించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి... 1.16 లక్షల మందిని తరలించి, వారికి భోజన ఏర్పాట్లు చేశారు.

ఇది పెనువిపత్తు: ఏరియల్ సర్వే నిర్వహించిన చంద్రబాబు

మొంథా తుపాన్‌ను పెనువిపత్తుగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మొంథా వల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం జరిగిందన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం సీఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి... తుపాను బాధితులను పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, పరిహారం అందించారు. తిరిగి వచ్చిన తర్వాత సచివాలయంలో ఆర్టీజీఎస్ అధికారులతో తుపాను వల్ల వచ్చిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా సమీక్ష జరిపారు. సహాయక చర్యలు ఏ విధంగా కొనసాగుతున్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని, ఎక్కడా వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్టపరచాలని, పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మొంథా తుపానుపై ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రాణ నష్టం లేకుండా చేయగలిగామని, ఆస్తి నష్టం కూడా చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నామని సీఎం అన్నారు. అయితే అనేక జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌలు రైతులు సహా అందరికీ పరిహారం అందజేసి రైతులకు అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు.

భారీ వర్షాలతో పొంగుతున్న వాగులు,నదులు

తుపాన్ తీరం దాటిన తర్వాత కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కడప జిల్లాలో కుందూ నది ఉగ్రరూపం దాల్చింది. చాపాడు మండలం సీతారామపురం వద్ద వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. చోడవరం నియోజకవర్గం భోగాపురం ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా శారదా నది ఉగ్ర రూపం దాల్చింది. తాచేరు, పెద్దేరు, బొడ్డేరు కలయికతో నీటి ప్రవాహం పెరగడంతో గట్టు పెద్దఎత్తున కోతకు గురైంది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఒడిశాలోని భగలటి నుంచి వరద పోటెత్తడంతో బాహుదా నది ఉగ్రరూపం దాల్చింది. డొంకూరు వద్ద కాజ్‌వేపై నీరు చేరడంతో సమీపంలోని నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా ఏపీకి వచ్చే అనేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. బుధవారం 49, గురువారం ఆరు రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

ముంచిన మొంథా తుపాన్

- నేలమట్టమైన వరి, పత్తి
- భయం గుప్పెట్లో మున్నేరు ముంపు ప్రాంతాలు
- వాగులో కొట్టుకుపోయిన వ్యాన్ గల్లంతయిన డ్రైవర్
- సత్తుపల్లి ఓపెన్ కాస్ట్‌లో నిలిచిపోయిన బొగ్గు

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : మొంథా తుపాను ఖమ్మం జిల్లాలో రైతులను నిండా ముంచింది... వరి, పత్తి , భారీ వర్షాలు కన్నీళ్లు మిగిల్చాయి ... ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికొచ్చే తరుణంలో నీటిపాలైంది ... ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో ఒక వ్యాను కొట్టుకుపోగా దాని డ్రైవర్ నీటిలో గల్లంతయ్యాడు.... ఖమ్మం నగరాన్ని మున్నేరు వరద ప్రవాహం వణికిస్తోంది... మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు అప్రమత్తం గా ఉండాలని మైకు అనౌన్స్మెంట్ ద్వారా హెచ్చరించారు. సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ముంతా తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఖమ్మం జిల్లా రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. చేతికొచ్చే తరుణంలో వరి పంట తుఫాను ప్రభావంతో మొత్తం పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు రెండున్నర లక్షల ఎకరాలకు పైగా వరిసాగు చేస్తున్నారు. అదేవిధంగా 2.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఈ తుఫాను కారణంగా ప్రధాన పంటలు గా ఉన్న వరి, పత్తి రెండు పంటలు నేలమట్టం అయ్యాయి. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మున్సిపల్ కమిషనర్ మున్నేరు గుంపు ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రికి వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలోని కొనిజర్ల మండలం, ఇటు రఘునాథపాలెం మండలం పరిధిలో పాపటపల్లి, బోనకల్లు మండలంలోని మరో వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. ఈ వాగుల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జిల్లా కలెక్టర్ ఆయా వాగు ప్రాంతాలను సందర్శించారు. అదేవిధంగా జిల్లాలోని మధ్యధర ప్రాజెక్టులైన పాలేరు వైరా రిజర్వాయర్లు కు వరద పోటెత్తింది.

నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి....

తుపాను ప్రభావంతో సత్తుపల్లిలోని జలగం వెంగళరావు ఓపెన్ కాస్ట్ బొగ్గు గనిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జేవిఆర్ఓసిలో 20వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా, కిష్టారం ఓసి లో 8 టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జిల్లాలో తుఫాను కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు ,పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు జిల్లాలో తుఫాను పరిస్థితి పై వారు సమీక్షిస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం : సీఐ

విశాలాంధ్ర, అశ్వరావుపేట : మొంథా తుపాన్ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు తమ సర్కిల్ పరిధిలో పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని సీఐ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన తోపాటు ఎస్ఐ యాయాతి రాజు, సిబ్బందితో కలిసి వాగులు, చెరువులను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించారు. వాగులు పొంగే ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. డిడిఆర్ఎఫ్ సిబ్బంది పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. వర్షాలకు అనేక గ్రామాల్లో నీరు చేరినట్లు చెప్పారు. ఇంకా 24 గంటలు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని సూచించారు. సెల్ఫీల కోసం ఎవరు వాగులు చెరువుల వద్దకు వెళ్ళవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సమీప పోలీసు అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

సమయస్ఫూర్తితో విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలింపు

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : మొంథా తుఫాన్ ప్రభావంతో నల్లగొండ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు జిల్లాలో ఆందోళన వాతావరణం సృష్టించాయి. అనేక గ్రామాలు, తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఈ సందర్భంలో దేవరకొండ మండలంలోని కోమ్మేపల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నీరు ఊచకోతలా వచ్చి చేరడంతో విద్యార్థులు ఒక దశలో ప్రమాదంలో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వేగంగా స్పందించి, పోలీసు సిబ్బందితో కలిసి పాఠశాల పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. వరద నీటిలో చిక్కుకున్న విద్యార్థులందరినీ తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఆదేశాలు ఇచ్చి స్వయంగా పర్యవేక్షించారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు సమన్వయంతో పనిచేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా విద్యార్థులందరూ క్షేమంగా బయటపడ్డారు. పిల్లలను ధైర్యం చెప్పిన ఎస్పీ పవార్ మాట్లాడుతూ, "ప్రజల ప్రాణాలు కాపాడడం పోలీసు వ్యవస్థ యొక్క మొదటి బాధ్యత. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి, అత్యవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకు రావద్దు" అని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందితో సమన్వయంగా పర్యవేక్షణ కొనసాగుతున్నదని తెలిపారు.

ఎస్పీ చొరవ ప్రజల ప్రశంసలు

తుపాన్ సమయంలో చూపిన చాకచక్యంతో, సమయస్ఫూర్తితో విద్యార్థులను రక్షించిన ఎస్పీ పవార్ పై ప్రజలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఎస్పీ నాయకత్వంలో పోలీసు వ్యవస్థ వేగవంతంగా స్పందించడం జిల్లా మొత్తానికి ఆదర్శంగా నిలిచింది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వనపర్తి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం చిట్యాల మార్కెట్ యార్డ్ లో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆ వెంటనే వరి ధాన్యం సంచిని తూకం చేసి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రభుత్వం సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తుందని చెప్పారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ వరి ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నిర్వాహకులు సహకరించాలని సూచించారు. రైతులు పంట తెచ్చిన రోజు రిజిస్టర్లలో ఏ రోజు తెచ్చారు, తెచ్చినప్పుడు ఎంత తేమశాతం ఉంది అనే వివరాలను నమోదు చేసుకుని, సీరియల్ నెంబర్ల వారీగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే అక్కడే ఉన్న వరి ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని పరిశీలించి దానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్య నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, నాయకులు, ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

విశాలాంధ్ర-మరిపెడ: 2025-26 ఆర్థిక సంవత్సరంకు వ్యవసాయ శాఖలో సబ్ మిషన్ ఆన్ ఆగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం ద్వారా సబ్సిడిలో వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని మరిపెడ మండల వ్యవసాయ అధికారి బోడ వీరాసింగ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మరిపెడ మండలంలోని రైతులు వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు 256, పవర్ స్ప్రేయర్లు 46, రోటవేటర్లు 18, సీడ్ కంఫర్టి డ్రిల్స్ 3,డిస్క్ హరో/కల్టివేటర్స్ / కేజ్ వీల్స్ / ఎబి ఫ్లవ్స్ 23, బండ్ ఫార్మర్స్ 1, పవర్ వీడర్స్ 2, బ్రష్ కట్టర్స్ 3, పవర్ టిల్లర్స్ 2, స్ట్రా బౌలర్స్ 3 అందుబాటులో ఉన్నాయని, ఎస్టి, ఎస్సి మరియు మహిళా రైతులకు 50 శాతం రాయితీతో, మిగితా రైతులకు 40 శాతం రాయితి ఉంటుందని తెలిపారు. రైతులు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్సితో పాటు దరఖాస్తు ఫారం నింపి మండల వ్యవసాయ కార్యాలయంలో ఈ నెల 31లోపు ఏఈఓకు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని ఏఓ రైతులను కోరారు.

మోడల్ విద్యార్థినికి శ్రీరామ్ లైఫ్ ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర పెనుబల్లి : మండలం లోని టేకుల పల్లి గ్రామం లొ గల మోడల్ స్కూల్ విద్యారని కీ శ్రీరామ్ హెల్ప్ ప్రతిభ పురస్కారం దక్కింది, టేకులపల్లి గ్రామనకి చెందిన శీలం జయశ్రీ 579/600 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచింది. హైదరాబాద్ లొ జరిగిన శ్రీరామ్ హెల్ప్ ప్రతిభ పూరషారాలలో శీలం జయశ్రీ నీ సన్మానించి మెమంటో తో పాటు 30000రూపాయలు నగదు ను అందచేశారు, అత్యంత ప్రతిభ చూపి జిల్లా టాపర్ గా నిలిచినా శేలం జయశ్రీ నీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీ బి, రూపాస్ అధ్యాపక బృందం అభినందిచారు.

జస్టిస్ గవాయిపై దాడి రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలి : మందకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : దేశ సర్వోన్నత న్యాయస్థానం న్యాయాధిపతి జస్టిస్ గవాయిపై న్యాయస్థానంలోనే ఒక వ్యక్తి మతం, ధర్మం ముసుగులో బూటు విసిరి తీవ్రంగా అవమానపరిచాడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ అన్నారు. ఇది కచ్చితంగా ఒక దళితుడిపై ,రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం ఆయన ఖమ్మం , ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో దళితులపై దాడులు ఆగలేదని ,కుల వివక్షత అంటరానితనం ,ఇవన్నీ ప్రతిరోజు దేశంలో ఏదో ఒక మూలన జరుగుతున్నట్లు చూడక తప్పడం లేదని పేర్కొన్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు జడ్జి పైనే ఒక లాయరు బూటు విసరడం అంటే ఆ వ్యక్తి రాజ్యాంగాన్ని ,చట్టాలను గౌరవించడం లేదని అర్థం అన్నారు. బూటు విసిరిన వ్యక్తికి మద్దతుగా మరికొంతమంది సోషల్ మీడియాలో , ఇతర మాధ్యమాల్లో బహిరంగంగా తమ ధర్మంపై ,తమ మతంపై ఎవరైనా వ్యాఖ్యానిస్తే ఇలాగే బూట్లు విసురుతామని, ఇంకా ఇంకా దాడులు చేస్తామని బరితెగించి మాట్లాడుతున్నారని మందకృష్ణ అన్నారు. జస్టిస్ గవైపై జరిగిన దాడిని సుమోటోగా తీసుకొని ఇప్పటివరకు ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయలేదు, అటు న్యాయవ్యవస్థ తరుపున కేసు నమోదు చేయించలేదు, ఢిల్లీ కేంద్రంగా ఉండే మానవ హక్కుల సంఘం సైతం సుమోటోగా కేసు నమోదు చేయలేదని మందకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు . ఇటీవల చతిస్గడ్ రాష్ట్రంలో అక్కడ హైకోర్టులో న్యాయమూర్తి పై ఒక లాయరు నోరు జారీ ఒకటి రెండు మాటలు అన్నందుకు వెంటనే అక్కడి న్యాయస్థానం సుమోటోగా తీసుకొని ఆ లాయర్ పై కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. ఇటీవల హైదరాబాదులో ఒక రౌడీషీటర్ ఒక కానిస్టేబుల్ హత్య చేస్తే ,అతనిని పోలీసులు ఎన్కౌంటర్ చేయగా ,మానవ హక్కుల సంఘం వెంటనే స్పందించి పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది తప్పా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై బూటు విసిరిన వ్యక్తిపై కేసు నమోదు చేసేందుకు ముందుకు రాకపోవడం గమనించదగ్గ విషయం అన్నారు . నవంబర్ ఒకటో తేదీన హైదరాబాదులో రాజ్యాంగ పరిరక్షణ ఆత్మగౌరవ పరిరక్షణ కోసం భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో అందరూ పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలియజేయాలని ఆయన అన్నారు. పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఇన్చార్జి కందికట్ల విజయ్ మాదిగ సోషలిస్టు మహాజన పార్టీ జిల్లా అధ్యక్షులు టి అంజయ్య , జిల్లా నాయకులు సునీల్ మాదిగ , నాయకులు చిలకా నాగరాజు , ముత్తారావు తో పాటుగా మ్మార్పీఎస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు రూ.9.50 లక్షల పంపిణీ : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ ఇటీవల జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన ముగ్గురు సభ్యులకు ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు రూ. 9 లక్షల 50 వేల నగదును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అందజేసారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో చెక్కుల రూపంలో ఈ రివార్డులు అందించారు. చత్తీస్గఢ్‌కు చెందిన మావోయిస్టులు రామ్ సింగ్ కొడేకు రూ.5 లక్షలు, ముచ్చికి సోందాల్‌కు రూ. 3లక్షల 75 వేలు, సోడి భీమేకు రూ. 75 వేలు ప్రభుత్వం మంజూరు చేయగా అందించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ లొంగిపోయిన వారికి తెలంగాణ ప్రభుత్వం నుండి మంజూరైన రివార్డు నగదులను వారి పునరావాసం కోసం అందజేయడం జరిగిందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మిగిలిన మావోయిస్టు నాయకులు, సభ్యులు కూడా ఆయుధాలు వీడి లొంగిపోయి ప్రజా స్వామ్య బద్ధంగా ప్రజల హక్కుల తరుపున పోరాడాలని ఎస్పీ కోరారు. అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవిలు పాల్గొన్నారు.

విరాహత్ పై దుష్ప్రచారం తగదు

విశాలాంధ్ర బ్యూరో,సంగారెడ్డి : హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టి యు డబ్ల్యు జే ఐజేయు బలపరిచిన విజయ్ కుమార్ రెడ్డి ఫ్రెండ్స్ ప్యానెల్ ఘన విజయం సాధించడంతో కొంతమంది వ్యక్తులు పనిగట్టుకుని రాష్ట్ర సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీపై దుష్ప్రచారం చేస్తున్నారని సంగారెడ్డి జిల్లా టీయుడబ్ల్యూజే(ఐజేయు) అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ ఆరోపించారు.బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఫ్రెండ్స్ ప్యానల్ కు తమ సంఘం పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించిందని, అంతేకాకుండా ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ మద్దతును కూడగట్టుకోవడం ద్వారా ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకున్నదని తెలిపారు. అయితే ఈ విజయం సందర్భంగా కొందరి కుట్రలను ఉద్దేశించి మాత్రమే విరాహత్ అలీ వ్యాఖ్యానించారని బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్ ఎన్నికల సమయంలో అనేకమంది అనేక విధాలుగా కుట్రలు చేసిన సంగతి అందరికీ తెలుసునన్నారు. అయినప్పటికీ టియుడ బ్ల్యూజే బలపరిచిన ప్యానెల్‌ను ఏకపక్షంగా జర్నలిస్టులు గెలిపించారన్నారు. ఈ గెలుపును జీర్ణించుకోలేక పోవడం వల్లనే కొందరు వ్యక్తులు అనవసరంగా విమర్శలు చేస్తున్నారని, పెడార్థాలు తీస్తున్నారని ఆరోపిం చారు. జర్నలిస్టుల ఐక్యతను దెబ్బతీస్తున్నారని యాదగిరి పేర్కొన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం టి యు డబ్ల్యూజే (ఐ జె యు) పక్షాన విరాహత్ అలీ ప్రతిక్షణం పోరాడుతున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ మడమ తిప్పకుండా హక్కులను సాధించారని వివరిం చారు. గ్రామీణ జర్నలిస్టులతో పాటు పట్టణ ప్రాంత జర్నలిస్టుల సంక్షేమానికి అంది వచ్చిన అన్ని మార్గాల ద్వారా సాధించారని చెప్పారు. సాధారణ జర్నలిస్టుగా వచ్చి రాష్ట్ర అధ్యక్షుడుగా ఎదిగారంటేనే ఎంత నిబద్ధత ఉన్నదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో ఓటమిని హుందాగా స్వీకరించకుండా కొంతవ ంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఇలాంటి ప్రచారాలతో పబ్బం గడుపుకోవాలను కుంటే కుదరదని తెలిపారు. జర్నలిస్టులు సహించబోరని ఆయన అన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే విజయ్ కుమార్ రెడ్డి విజయాన్ని క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలన్నారు. జర్నలిస్టుల హక్కులను సాధించేందుకు నిరంతరం పాటుపడు తున్న విరాహత్ అలీని క్షమాపణ కోరడం సరికాదని యాదగిరి అన్నారు.

మొంథా తుపాన్‌తో అల్లకల్లోలం

విశాలాంధ్ర గూడూరు : జిల్లాలోని గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాల్లో పరిస్థితి మొంథా తుఫాన్ భారీ వర్షాలతో బుధవారం అల్లకల్లోలం సృష్టించింది .గూడూరులోని పాకల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కొత్తగూడెం మండలంలోని గుంజేడు ముసలమ్మ దేవస్థానం పరిధిలో ఉన్న పారివృక్షం రోడ్డుపై పడింది.మూడు గంటల పాటు ప్రయాణికులకు అంతరాయం కలిగించిశీఅవగది. గంగారం మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గూడూరు సిఐ సూర్య ప్రకాష్, ఎస్సై గిరిధర్ రెడ్డి, కొత్తగూడ ఎస్ఐ రాజకుమార్,కొత్తగూడ తాహసిల్దార్ రాజ్ కుమార్, గూడూరు మండల ఏవో అబ్దుల్ మాలిక్ వర్షబావ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వాగులు దాటకుండా భారీ గేట్లను ప్రమాద హెచ్చరిక బోర్డులను పెట్టడం జరిగింది. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కరెంటు దారి వెంట కింద పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.

నిర్మాణాత్మక సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: బుధవారం సాయంత్రం గుర్తింపు కార్మిక సంఘం, ఏఐటీయుసీతో ఆర్జీవన్ జీఎం కార్యాలయంలో సింగరేణి ఆర్జీవన్ ఏరియా యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశం జరిగిగింది. ఈ సమావేశానికి జీఎం లలిత్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్మికులకు సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో జరిగిన నిర్మాణాత్మక సామావేశంలో తీసుకున్న నిర్ణయాలు చాలావరకు పరిష్కారం జరిగినవని, మరికొన్ని జరగవలసి ఉన్నదని అన్నింటికి సానుకుల వాతావరణంలో పరిష్కారం జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీను, మడమ మహేష్, వెంకటరెడ్డి, సిద్ధమల్ల రాజు,విజయ లక్ష్మి, మల్లిఖార్జున్, అధికారులు యస్ఓటు జియం చంద్రశేఖర్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్, ఏజంట్ చిలుక శ్రీనివాస్, యల్ రమేష్,ఒసి5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్,పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఎజియం ఐఇడి ఆంజనేయులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అన్నారు. బుధవారంభారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా తుపానుతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అన్ని విభాగాల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు కంట్రోల్ రూమ్ నెంబర్,నిత్యం సిబ్బంది అందుబాటులోఉంటారాని,వర్షాలు వరదలు వలన ఎలాంటి ఇబ్బందులు కలిగిన 7995074803 ఈ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. జిల్లా యంత్రాంగం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, స్వయంగా (డోర్నకల్ రైల్వే స్టేషన్) క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి రైల్వే అధికారులకు, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు తగు సూచనలు జారీ చేసారు.

నేడు విద్య సంస్థలకు సెలవు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: మొంథా తుపాను కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు నేడు గురువారం రోజున సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ అత్యవసర సమాచారాన్ని తమ పరిధిలోని పాఠశాలలకు, విద్యార్థులకు తెలియజేసి, తగిన చర్యలు తీసుకోగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తుండటంతో అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. కలెక్టరేట్ కార్యాల యంలో బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వర్షాల తీవ్రత దృష్ట్యా నేడు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు స్థానిక సెలవు ప్రకటించామని, జాలర్లను చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించామని చెప్పారు. రోడ్లు, బ్రిడ్జీలు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తే తాత్కాలికంగా వాహన రాకపోకలు నిలిపివేసినట్లు వివరించారు. నదులు, చెరువులు, కాలువల వద్ద ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రజలను ప్రమాద ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. ఉదయం టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ, పట్టణ స్థాయిలో పర్యటించి శిథిలావస్థలో ఉన్న మూడు ఇళ్లను గుర్తించి, అక్కడి కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు.మండల, గ్రామస్థాయి అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండి, ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ (ఫోన్: 6281492368) ఏర్పాటు చేసినట్లు తెలిపారు.డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (DRF) బృందాలు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ పట్టణాల్లో సిద్ధంగా ఉన్నాయని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఎస్‌డిఆర్ఎఫ్ బృందంఅప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : మొంథా తుపాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా కేంద్రం నుండి గ్రామస్థాయివరకు అధికారులు తమ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ బుధవారం ఆమె మొంథా తుఫాన్ ప్రభావంపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకు రావొద్దని సూచించారు. రైతులు పొలాల్లో పనులు చేయకుండా ఉండాలని, పంట కోతలు నిలిపివేయాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పాడైపోయే ఇళ్లలో ఎవరూ ఉండకూడదని నోటీసులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధిత ఆర్సీవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. దేవరకొండ డివిజన్‌లో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలు వర్షాలకు సంబంధించిన సమాచారం లేదా అత్యవసర పరిస్థితులను టోల్‌ఫ్రీ నంబర్ 1800-425-1442కు తెలియజేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులకు అవసరమైన చర్యలపై సూచనలు చేశారు.

ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర కీలకం

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ మందమర్రి: సింగరేణి కార్మికుల అనేక సమస్యలపై జి.ఎం ఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన మంచిర్యాల జిల్లా మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏఐటియుసి, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఏఐటియుసి నాయకులతో నిర్మాణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో జి.ఎం గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనది అని సింగరేణి సంస్థ ఉత్పత్తి మరియు ఉత్పాదకతలోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుంది అని తెలిపారు. గడిచిన సమావేశంలో జరిగిన పనుల యొక్క పురోగతి గురించి చర్చించారు.గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఏవిధముగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా అలానే సహకరి చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, కే.కే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఎస్.కె గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, కే.కే ఓ.సి ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, ఐ ఈ డి ఎస్ ఇ కిరణ్ కుమార్, ఏరియా స్టోర్స్ డీ.జీ.ఎం ఈ అండ్ ఎం సురేష్, సివిల్ ఎస్.ఇ రాము, రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ డి.వై.సీ.ఎం.వో ఎం.మధు కుమార్, డి.వై.పి.ఎం సందీప్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఏఐటీయూసీ మందమర్రి జాయింట్ బ్రాంచ్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి రమణ, సీనియర్ అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జమిలి కుటుంబసభ్యులకు పరామర్శ

విశాలాంధ్ర కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి మాజీ ఎంపీటీసీ మూడు జ్యోతి అత్త జమిలి మృతి పట్ల వైరా మాజీ ఎమ్మెల్యే లవుడియా రాములు నాయక్ బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. బుధవారం ఉసిరికాయలపల్లిలోని మాజీ ఎంపీటీసీ మూడు జ్యోతి ఇంటి వద్దకు మాజీ ఎమ్మెల్యే చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ వైరా ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ,మాజీ జెడ్పిటిసి జగన్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ రావురిశ్రీనివాసరావు,సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్,మాజీ ఎంపీటీసీలు ధరావత్ పాండ్యానాయక్ , పెద్దబోయిన ఉమాశంకర్, భాగం రూప నాగేశ్వరరావు, మాజీ సర్పంచులు మాలోత్ కిషోర్ నాయక్,బానోత్ బస్సిలాల్,బానోత్ పద్మా రాందాస్,పద్మా మోహన్, సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య మండల నాయకులు అజ్మీర వీరన్న,వాంకుడోత్ నరేష్ నాయక్,భూక్యా మోతిలాల్,హనుమంతు, భూక్యా ప్రసాద్,జాల సాంబ, కిట్టు తదితరులు ఉన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మవొద్దు

విశాలాంధ్ర, దమ్మపేట : నాయకపోడు సంఘం పేర జరిగే తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని జిల్లా అధ్యక్షుడు సోమనేని శివశంకర ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర్ 2న మండల కేంద్రంలో నిర్వహించబోయే "నాయకపోడు యువ గర్జన" పేరుతో జరుగుతున్న కార్యక్రమానికి రిజిస్టర్ నెంబర్ 141/2015 తో నమోదైన నాయకపోడు సంఘానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొంతమంది స్వార్థపరులు వారి స్వప్రయోజనాల కోసం తన జాతిని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇతర గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న దేవతల ఊరేగింపు కార్యక్రమానికి నాయకపోడు సంఘం పేర జాతిని మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ తప్పుదోవ పట్టించే ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుల పెద్దలు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులను కోరారు. తమ సంఘం ఐక్యతకు, బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి తాళదుర్గయ్య, నాయకులు భోగి వీరస్వామి, పూసి గోవర్ధన్, కొయ్యల అచ్యుతరావు, రావుల శ్రీనివాసరావు, అల్ల జంగం, గడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు నష్టపోయిన వరి

విశాలాంధ్ర- తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా నాగారం మండల పరిధి శాంతినగర్ గ్రామంలో రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి శాంతినగర్ గ్రామానికి చెందిన యువ కౌలు రైతు షేక్. జానీ కౌలుకు తీసుకున్న దాదాపు 10 ఎకరాల వరి పొలం నేలమట్టం అయ్యింది. అప్పుచేసి కుటుంబం మొత్తం కష్టపడి పెట్టుబడి పెట్టి ఆరుకాలం పండించిన పంట ఇలా వర్షాల తాకిడికి చేతికొచ్చిన వరి చేను మొత్తం నేలమట్టం అవడంతో రైతు కన్నీటి పర్యంతం అవుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం, నాగారం ఎమ్మార్వో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ స్పందించి తమను ఆదుకొని నష్ట పరిహారం అందించాల్సిందిగా రైతు కోరుతున్నారు.

సంపాదకీయం

విలయతాండవం

థాయ్ భాషలో 'మొంథా' అంటే "సువాసనలు వెదజల్లే పువ్వు" లేదా "సుందరమైన పువ్వు" అని అర్థం. ఆంధ్రప్రదేశ్‌ను కకావికలం చేసిన 'మొంథా' తుపాను అంతందమైన పువ్వులా ఏమీ కన్పించడం లేదు. అది సృష్టించిన విలయం దెబ్బకు తీరప్రాంత ప్రజల జీవనం అస్తవ్యస్తమైపోయింది. హిందూ మహాసముద్ర ఉత్తర భాగంలో ఏర్పడే తుపానులకు, ప్రపంచ వాతావరణ సంస్థ ఆధ్వర్యంలో మొత్తం 13 దేశాలు (భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయ్‌లాండ్ వంటివి) ఒక జాబితా ప్రకారం వంతులవారీగా పేర్లు పెడతాయి. ఈసారి తుపానుకు థాయ్‌లాండ్ మొంథా అనే పేరుపెట్టింది. పేరు ఏదైనా బీభత్సం ఒకటే. ఈసారీ అదే జరిగింది. 'మొంథా' ఏపీ కోస్తాలో తీరాన్ని దాటినప్పటికీ, ఉత్తరకోస్తా, ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. 'మొంథా' తుపాను ఆంధ్రా చరిత్రలో రాష్ట్రాన్ని తాకిన అతిపెద్ద తుపానుల జాబితాలోకి రాకపోయినప్పటికీ, 'మొంథా'ను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీవ్ర తుపానుగానే వర్గీకరించింది. తీరం దాటే సమయంలో దీని గాలి వేగం సుమారు 90–110 కి.మీ/గం వరకు ఉండటం దీని ప్రత్యేకత. గతంలో ఆంధ్రప్రదేశ్‌ను తాకిన కొన్ని భారీ తుపానులతో పోలిస్తే, 'మొంథా' తీవ్రత చాలా తక్కువగా ఉంది. 1977 లేదా 1996 నాటి తుపానుల సమయంలో గాలి వేగం గంటకు 215 కి.మీ వరకు కూడా నమోదైంది. 'మొంథా' తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ, ప్రభుత్వం ముందస్తుగా చేపట్టిన సమర్థవంతమైన సహాయక చర్యలు, లక్షలాది మంది ప్రజలను తరలించడం, ఆధునిక సాంకేతిక హెచ్చరికల వ్యవస్థల కారణంగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం అంచనా కంటే చాలా తగ్గింది. ఈ విషయంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. అయితే జరిగిన నష్టాన్ని పూడ్చే బాధ్యతను ఏ మేరకు తీసుకుంటుందనే విషయంపై అనుమానాలు లేకపోలేదు. ఎందుకంటే, గడిచిన తుపాన్ల నష్టాల భర్తీ ఏనాడూ ప్రజలకు స్వాంతన చేకూర్చలేదు. ఈసారి అందుకు భిన్నంగా ఉంటుందంటే సందేహమే! తుపాను నష్టాన్ని అడ్డుకోలేం. కాకపోతే మారిన పరిస్థితుల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, తుపాను దశదిశను ఎప్పటికప్పుడు అంచనా వేసుకొని, నష్టాన్ని తగ్గించుకోగలం. ఏపీ ప్రభుత్వం తుపాను కారణంగా ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు ధృవీకరించింది. తుపాను తీరం దాటే ముందు, తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల నుంచి 76,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, 800కు పైగా సహాయ శిబిరాలకు తరలించారు. పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, వంట నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, చక్కెరను కేజీ చొప్పున పంపిణీ చేయాలని ఆదేశించారు. కానీ ఆదేశాలు చాలా వరకు ఆదేశాలుగానే మిగిలిపోయాయి. 50 శాతం మందికి సహాయం సరిగా అందకపోవడం బాధాకరం. ఎన్ని యుగాలు గడిచినా, పునరావాస కేంద్రాల్లో ఆకలికేకలు తప్పడం లేదు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పునరావాస కేంద్రంలో తలదాచుకున్న దాదాపు 350 మంది మత్స్యకార కుటుంబాలు దాదాపు 12 గంటలపాటు ఆకలిదప్పులతో అలమటించాల్సి వచ్చింది. వారికి తాగునీరు, అల్పాహారం, పాలు, బిస్కెట్లు వంటివి ఏవీ అందలేదు. పసిపిల్లల రోదనలు, ఆర్తనాదాలతో మిన్నంటిన దృశ్యాలు హృదయాన్ని ద్రవింపజేశాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 271 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినా, వాటిలో జీరో సౌకర్యాలు బాధితులకు వేదన మిగిల్చాయి. రోజంతా వారి ఆక్రందనలు వినేవారే లేకుండాపోయారు. బాధితులు పడుకోవడానికి గ్రీన్‌మ్యాట్‌లు వేసి చేతులు దులుపుకున్న అధికారుల దారుణ వైఖరి అసహ్యమనిపించింది. మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను రెట్టింపు పరిమాణంలో అందించాలన్న ఆదేశమూ అమలు జరగలేదు. సిబ్బంది కొరత పేరుతో అధికారులు తప్పించుకు తిరుగుతున్న ధోరణి జుగుప్సాకరం. ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందించడానికి 219 వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైద్యశిబిరాలు మాత్రం సంతృప్తి కలిగించాయి. వైద్యుల చొరవ అభినందనీయం.

'మొంథా' తుపాను ప్రభావం వల్ల ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 1.76 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ఇందులో 38,000 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 1.38 లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 243 మండలాలకు నష్టం వాటిల్లింది. దాదాపు రొయ్యలు చెరువులన్నీ మునిగిపోయాయి. కనీసం కిలో రొయ్యలైనా బతికిన దాఖలాలు లేవు. నష్టం అంచనాలపై నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించడానికి మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటివరకు అదేం జరగలేదు. ఉత్తర్వులు ఐదారు శ్రేణులుదాటి కిందిస్థాయికి వచ్చేసరికి 'మొంథా' ప్రభావం తగ్గిపోయింది. జనం ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు చేతులు దులుపుకున్నారు. కూలిపోయిన చెట్లు, శిథిలాలను తొలగించడానికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రంగంలోకి దిగి చర్యలు చేపట్టడం ప్రశంసనీయం. తుపాను కారణంగా కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ లైన్లను పునరుద్ధరించడానికి దాదాపు 10,000 మంది సిబ్బంది పడిన శ్రమనూ అభినందించాల్సిందే. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ తీరాన్ని అల్లకల్లోలం చేసి, చరిత్రలో నిలిచిపోయిన అత్యంత భయంకరమైన, అతిపెద్ద తుపానులలో 1977 దివిసీమ పెను తుపానుదే మొదటిస్థానం.200 కి.మీ/గం పైగా వేగవంతమైన పెనుగాలులతో దివిసీమ (కృష్ణా జిల్లా) విధ్వంసమైంది. దాదాపు 10,000 మందికి పైగా మరణించినట్లు అంచనా. 1990 ఆంధ్రప్రదేశ్ పెను తుపాను కూడా విలయతాండవ చేసిన గురుతులు ఇంకా మాసిపోలేదు. 200 కి.మీ/గం వరకు వేగంతో గాలులు వీచి, మచిలీపట్నం (కృష్ణా జిల్లా)ను ముంచెత్తింది. 1996 కోనసీమ తుపానూ తీవ్రమైనదే. ఇది 215 కి.మీ/గం వరకు వేగంతో వీచిన గాలులతో కాకినాడ–యానాం (కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా) కుంగిపోయింది. ఇక రాష్ట్ర విభజన తర్వాత 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపాను అత్యంత తీవ్ర తుపానుగా విదితమే. 185 కి.మీ/గం వరకు వీచిన గాలులకు విశాఖపట్నం ఛిద్రమైంది. దాని జాడలు నేటికీ విశాఖతీరాన్ని వదల్లేదు. ఈ చారిత్రక తుపానులు వేల సంఖ్యలో ప్రాణ నష్టాన్ని, వందల కోట్ల ఆస్తి నష్టాన్ని కలిగించాయి. 'మొంథా' విలయమూ భయానకమే. మరో పదేళ్లు మోదీరాజ్యమే అని ప్రకటించిన సీఎం చంద్రబాబు 'మొంథా' తుపాను బీభత్సంపై సరైన అంచనా వేసి, కేంద్రసాయం పొందడంపై చిత్తశుద్ధి చూపాలి.

క్లౌడ్ సీడింగ్ పరిష్కారమా?

డి జైరామ్



దేశ రాజధాని దిల్లీ ప్రతి ఏటా చలికాలం ఆరంభంలో, ముఖ్యంగా దీపావళి పండుగ ముగిసిన వెంటనే, తీవ్రమైన వాయు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడం నిరంతర సవాలుగా మారింది. ఈ సమయంలో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) సులభంగా 401 నుంచి 500 మధ్య ఉండే అత్యంత ప్రమాదకర స్థాయిని చేరుకుంటాయి. పండుగ సందర్భంగా కాల్చే బాణసంచా నుంచి వెలువడే ఉద్గారాలు, పొరుగు రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్‌లో జరిగే పంట వ్యర్థాల దహనం వలన చల్లని, నిశ్చలమైన వాతావరణం కలిసిపోయి, గాలిలో పీఎం 2.5, పీఎం 10 వంటి సూక్ష్మ కణాల సాంద్రతను విపరీతంగా పెంచుతాయి. ఈ కాలుష్య మేఘం దిల్లీని వాయు కాలుష్య గనిగా మార్చింది. తక్షణ ఉపశమనం కోసం దిల్లీ ప్రభుత్వం, ఐఐటీ–కాన్పూర్ వంటి పరిశోధనా సంస్థలు క్లౌడ్ సీడింగ్ అంటే కృత్రిమ వర్షం అనే వినూత్న శాస్త్రీయ పరిష్కారం వైపు దృష్టి సారించాయి. గాలిలో పేరుకుపోయిన విష కణాలను వర్షం ద్వారా నేలను కడిగివేసి, ప్రజలకు తాత్కాలికంగా మెరుగైన గాలిని అందించాలనే ఆశతో ఈ ప్రయత్నం చేశారు.

ఎక్యూఐ అనేది ఆరు ప్రధాన కాలుష్య కారకాలైన సూక్ష్మ కణాలు పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఓజోన్ ఆధారంగా గాలి నాణ్యతను కొలవడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన కొలమానం. ఈ సూచీ 0 నుంచి 500 వరకు ఉంటుంది. గాలి ఎంత ప్రమాదకరంగా ఉందో ఇది పౌరులకు తెలియజేస్తుంది. దిల్లీలో దీపావళి తర్వాత ఈ స్థాయిల పెరుగుదల గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళన కలిగిస్తోంది. ఈ స్థాయిలో, కాలుష్యం కేవలం శ్వాసకోశ లేదా గుండె జబ్బులు ఉన్నవారిని మాత్రమే కాకుండా, ఆరోగ్యవంతులైన ప్రజలను కూడా ప్రభావితం చేస్తుంది. ఇది తీవ్రమైన శ్వాస సమస్యలకు ఇతర అనారోగ్యాలకు దారితీస్తుంది. ఈ కాలుష్యం సాధారణంగా పది రోజుల నుంచి రెండు వారాల పాటు కొనసాగుతుంది. క్లౌడ్ సీడింగ్ అనేది శాస్త్రీయంగా వాతావరణ మార్పు సాంకేతికత అని కూడా పిలుస్తారు. ఇది కృత్రిమంగా వర్షపాతాన్ని లేదా హిమపాతాన్ని ప్రేరేపించే ఒక ప్రక్రియ. ఈ పద్ధతిలో, సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లేదా పొడి మంచు వంటి తేమను పీల్చుకునే రసాయనాలను ప్రత్యేకంగా రూపొందించిన విమానాలు లేదా డ్రోన్‌ల ద్వారా మేఘాల అత్యంత చల్లని భాగాలపై చల్లుతారు. ఈ రసాయన కణాలు మేఘాలలో ఉన్న నీటి ఆవిరిని తమ చుట్టూ కేంద్రీకరించి, ఘనీభవన కేంద్రాలుగా పనిచేస్తాయి. దీని ఫలితంగా నీటి బిందువులు బరువెక్కి వర్షం రూపంలో భూమిపై పడతాయి.

ఈ సాంకేతికత మన దేశానికి కొత్తేమీ కాదు, అయితే దీనిని కాలుష్య నివారణ కోసం ఉపయోగించడం ఇదే తొలిసారి. భారతదేశంలో పూర్వపు ప్రయోగాలను ప్రధానంగా కరువు నివారణ, వర్షపాతం పెంపుదల కోసం నిర్వహించారు. 2003లో మహారాష్ట్రలో వర్షపాతాన్ని పెంచడానికి ఈ సాంకేతికతను విజయవంతంగా ఉపయోగించారు. రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతాలలో జరిపిన ప్రయోగాలలో వర్షపాతాన్ని పెంచడంలో ఇది కొంతవరకు విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలు కూడా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వ్యవసాయానికి, జల వనరులకు మద్దతుగా ఈ పద్ధతిని ఉపయోగించాయి. ఈ ప్రయోగాలలో 25% నుంచి 40% వరకు వర్షపాతం పెరుగుదల కనిపించినట్లు కొన్ని నివేదికలు సూచించాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు దీనిని విజయవంతంగా అమలు చేశాయి. వాతావరణాన్ని నియంత్రించడంలో ప్రపంచంలోనే అత్యంత చురుకైన దేశంగా చైనా ఉంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి ముందు వర్షాన్ని కురిపించి, కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి ఎడారి దేశాలు ముఖ్యంగా నీటి వనరులను పెంచడానికి, వేసవిలో వర్షపాతాన్ని ప్రేరేపించడానికి ఈ పద్ధతిని నిరంతరం ఉపయోగిస్తున్నాయి. ఈ విధానం ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ, దీని ఫలితాలు పూర్తిగా మేఘాల నాణ్యత, అందుబాటులో ఉన్న తేమ, గాలి దిశ వంటి స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కాలుష్య నివారణ విషయంలో, ఈ పద్ధతి ద్వారా తక్షణమే మెరుగుపడినప్పటికీ, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. కాలుష్యానికి మూల కారణాలు పరిష్కరించనంత వరకు, గాలి నాణ్యత తక్కువ సమయంలోనే తిరిగి క్షీణించే అవకాశం ఉంది. సిల్వర్ అయోడైడ్ వంటి రసాయనాల వల్ల పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావాలు ఉంటాయా అనే అంశంపై శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తల మధ్య ఇప్పటికీ ఆందోళనలు, చర్చలు కొనసాగుతున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం ఈ పద్ధతి ద్వారా గాలి నాణ్యతను గరిష్టంగా 80–100 పాయింట్ల వరకు మాత్రమే మెరుగుపరచగలరు. ఇది కాలుష్యాన్ని పూర్తిగా తొలగించడానికి సరిపోదు.

సెల్: 9440485824

దుర్దశ నుంచి బీహార్ అభివృద్ధి

డా॥జ్ఞాన్‌పాఠక్

బీహార్‌ను దుర్దశ నుంచి అన్ని రంగాలలోను అభివృద్ధి చేస్తామని ఇండియా బ్లాక్ తన ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. ప్రణాళికను 2025 అక్టోబరు 28 న విడుదల చేసింది. ప్రస్తుతం ఎన్డీఏ పరిపాలన అత్యంత అధ్యాన్నంగా ఉన్నదని ప్రజలు భావిస్తున్నారు. జేడీ(యూ) నాయకుడు, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్డీఏ పాలనలో సాగుతోంది. పేదరికంలో ఉన్న ఈ రాష్ట్రం నుంచి వేలాది మంది ఇతర రాష్ట్రాలకు వెళ్లి పనులు చేసుకొంటున్నారు. ప్రస్తుతం అత్యంత దారుణంగా ప్రజల పరిస్థితి ఉంది. బీహార్‌ను సామాజిక, ఆర్థిక రంగాలలో వృద్ధి పరిచి పౌరులందరికి న్యాయం చేస్తామని ఎన్నికల ప్రణాళిక పేర్కొంది. ఇండియా బ్లాక్ తరపున లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విస్తృతంగా పర్యటించి ప్రజలను ఆకట్టుకున్నారు. అలాగే ఆర్జేడీ నాయకుడు, ఇండియా బ్లాక్ తరపున ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని భావిస్తున్న తేజస్వియాదవ్ రాహుల్‌గాంధీతో పాటు విస్తృత ప్రచారం సాగించారు. ఎన్డీఏ నాయకత్వంలోని పరిపాలన అన్ని అంశాలలోను విఫలం చెందింది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, శాంతి భద్రతలు, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా వెనుకబడి ఉంది. పనుల కోసం లక్షలాది మంది ఇతర రాష్ట్రాలకు తరలిపోవడం, అవినీతి, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరగడం, కరువుకాటకాలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడిపోయాయి. పారదర్శకత, బాధ్యత తదితరాలు ఎక్కడా కనిపించవు. అసమానతలు అత్యధిక ప్రజలలో ఉన్నాయి. దళితులు, ఓబీసీలు, ఈబీసీలు, మహిళలు, మైనార్టీలపైన అణచివేత నిత్యం సాగుతోంది.

బీహార్‌లో ప్రస్తుతం ఉన్న దుర్దశను ఇండియా బ్లాక్ నాయకత్వం రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి గుర్తించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అధ్వాన్న స్థితి నుంచి కోలుకొనేందుకు ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్

సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించి ప్రజల ముందు ఉంచలేదు. పేదలకు, అణగారిన వర్గ ప్రజలకు ఓట్లు వేసే హక్కును ప్రభుత్వం లాక్కునేందుకు లోతైన కుట్ర పన్నారు. అధ్వాన్న స్థితి నుంచి బీహార్ ప్రజలను పరిరక్షించి ప్రజలంతా సంతోషపడే రాష్ట్రాన్ని తయారుచేస్తామని ఇండియా బ్లాక్ ప్రణాళిక వాగ్దానం చేసింది. ఆర్థిక, సామాజిక న్యాయాన్ని రాష్ట్ర ప్రజలందరికి కల్పిస్తామని ప్రణాళిక ప్రతిజ్ఞ చేసింది. కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం రూపొందించిన ప్రణాళికా పత్రం కాదని, ఇది చారిత్రాత్మక నిబద్ధత అని ప్రణాళికలో ఆర్థిక అంశాలు ఉన్నాయి. సామాజిక న్యాయాన్ని కల్పిస్తామని నొక్కి వక్కాణించారు. ముందుగా ప్రణాళికలోని ప్రతి ఇంటికి ఒక ఉద్యోగాన్ని కల్పించేదుకు తగిన చర్యల పత్రాన్ని రూపొందిస్తామని వాగ్దానం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 20 నెలల్లో నెరవేరుస్తామని ప్రణాళిక తెలిపింది. బీహార్ ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగం అన్నిటికంటే ఎక్కువగా చర్చకు వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు హాజరవుతున్నారు. అయితే ఇండియా బ్లాక్ ప్రభుత్వం వస్తే పోటీపరీక్షలకు పంపించేందుకు ఫీజులు లేకుండా అనుమతిస్తామని ప్రణాళిక తెలిపింది.అలాగే రవాణాను ఎలాంటి టిక్కెట్లు లేకుండా అనుమతిస్తామని ప్రణాళిక తెలిపింది. అపాయింట్‌మెంట్లలో అవకతవకలు జరిగినా పరీక్షలను రద్దు చేస్తామని వెల్లడించింది.

ఉద్యోగాలు ఇవ్వటానికి బీదవిద్యార్థులకే ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. దీర్ఘకాలికంగా ప్రభుత్వం తమకు గుర్తింపు ఇవ్వలేదని, ఇప్పటికైన ఇవ్వాలని జీవిత దీదీలు డిమాండ్ చేశారు. అలాంటి వారికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడమే కాకుండా నెలకు 30 వేలు వేతనం ఇస్తామని ప్రణాళిక వెల్లడించింది. కాంట్రాక్టు కార్మికులు ఔట్ సర్సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపరిచి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. వృద్ధులకు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని ఇండియా బ్లాక్ వాగ్దానం చేసింది. వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. వీటికి మరో 200 కలిపి తాము ఇస్తామని వికలాంగులకు నెలకు రూ.3వేలు పెన్షన్ ఇస్తారు. గ్రామీణ ఉపాధి పథకం కింద పనిచేసే కార్మికులకు ఇకపై రోజుకు రూ.400 ఇస్తారు. ఈ కార్మికులకు పనిచేసే రోజులను ఏడాదికి వంద నుంచి 200 లకు పెంచనున్నారు. అలాగే ప్రత్యేక కార్మికుల సంఖ్య పథకాన్ని ఏర్పాటు చేస్తామని అప్పుడు ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత కలుగుతుందని ప్రణాళిక తెలిపింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లిన బీహార్ కార్మికులకు కూడా ఈ సదుపాయం ఉంటుంది. మై బహన్ యోజన కింద మహిళలకు డిసెంబరు నుంచి నెలకు రూ.2,500 ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. మహిళలకు ఇల్లు, ఆహార ధాన్యాలు కూడా కల్పిస్తారు. విద్య, శిక్షణ కోసం కుమార్తెలకు ఆర్థిక సహాయం ఉంటుంది. ప్రతి ఇంటికి 200 విద్యుత్ యూనిట్లను ఉచితంగా సరఫరా చేస్తారు. సూక్ష్మ ఆర్థిక కంపెనీలు ఇచ్చే డబ్బుపై వసూలు చేసే వడ్డీ రేట్లను క్రమబద్ధం చేస్తూ చట్టం తీసుకువస్తామని ఇండియా బ్లాక్ హామీ ఇచ్చింది. రుణం ఇచ్చిన కంపెనీల ఏజెంట్ల నుంచి మహిళలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలోని ప్రతి సబ్‌డివిజన్‌కు మహిళా కాలేజీలను ఏర్పాటు చేస్తారు. 136 డవలప్‌మెంట్ బ్లాకులలో ఒక్క దానికి కూడా డిగ్రీ కాలేజీ లేదు. తమ ప్రభుత్వం వస్తే అన్ని బ్లాకులకు డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేస్తామని ప్రణాళిక హామీ ఇచ్చింది. ఆర్థిక సహాయం లేని కాలేజీలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తారు. రైతులకు చట్టబద్ధంగా అన్ని పంటలకు ఎంఎస్పీ ధరను కల్పిస్తామని పేర్కొన్నారు. పంచాయితీలు, మున్సిపల్ సంస్థలో వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్‌లు కూడా కల్పిస్తామని ప్రణాళిక తెలిపింది. ఇవిగాక ఇంకా అనేక వాగ్దానాలు, ప్రణాళికలు ఉన్నాయి. అయిదు లక్షల వరకు వడ్డీలేని రుణాలను నాయీబ్రాహ్మణులకు, కుమ్మరులు, కార్పెంటర్‌లు తదితర అనేక తరగతుల పనివాళ్లకు అందిస్తారు.

పేదలకు పెమ్మరాజు అపూర్వ సేవలు

డా॥ కొప్పరపు నారాయణమూర్తి

'బీద విద్యార్థులకు పాఠశాలలు తెరవడానికి తనకున్న స్థలం, హైద్రాబాదులో ఉన్న ఇల్లు కూడా అమ్మిన వ్యక్తి డా. పెమ్మరాజు దుర్గా కామేశ్వర రావు' భారత్ జనని వెబ్ సైట్ నుంచి. ఆంధ్రప్రదేశ్‌లోని మూలమూలలు పరిశోధించి బడుగుజీవులు మౌనంగా ఎదుర్కొంటున్న ఆర్థిక సాంఘిక సాంస్కృతిక రాజకీయ వివక్షలు, దారుణ పైశాచిక అస్పృశ్యతా పర్వాలు మొదలైన వాటిని క్షుణ్ణంగా శోధించి, నాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ కందాను సంప్రదించి, విజయనగరం జిల్లా 'గరివిడి', చీపురుపల్లి మండలాలలో తన కార్యక్రమాలను తొలుతగా ప్రారంభించాలని నిర్ణయించుకొన్న నవ శక సామాజిక నిర్మాత, న్యూక్లియర్ భౌతిక శాస్త్రవేత్త ఆచార్య పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు. 1979 లో అప్పన్నవలస గ్రామాన్ని తొలి కార్యక్షేత్రంగా ఎంచుకొన్నారు. అప్పన్నవలస గ్రామంలో 70 శాతం దళితులు, నిరుపేదలే ఉన్నారు. నిరక్షరాస్యత కూడా ఎక్కువ. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అందినంత దోచుకొనే వారికి కొదవేలేదు. బ్యాంకు ఆఫీసర్, పశువైద్య అధికారి చేతులు కలిపి పశువులు కొనడానికి రుణాలు మంజూరు చేసినట్టు కాగితాలు సృష్టించారు. కొన్నాళ్ల తరువాత అప్పు తీర్చాలంటూ రైతులకు నోటీసులు పంపారు. పెళ్లిళ్లకూ, పురుళ్లకూ చేసిన అప్పులే తీర్చుకోలేని పరిస్థితి. ఇంతలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఈ నోటీసులు... చేయని అప్పులు ఎక్కడనుంచి తీరుస్తారు. నెత్తినోరు బాదుకొన్నా పట్టించుకొనే నాథుడు లేడు. ఇదే కామేశ్వరరావు ఎదుర్కొన్న ప్రథమ సవాలు. బాధితులకు ధైర్యం చెప్పాడు. బ్యాంకుకు వెళ్లి రికార్డులు తీయించాడు. ఉన్నతాధికారులను కలిసి అంతా వివరించారు. పెద్దల భాగోతాలు ఒక్కొక్కటే బయటికి వచ్చాయి. తప్పుడు పద్ధతులకు ఒడిగట్టి అమాయక రైతులను చేయని అప్పులలో ఇరికించి సొమ్ము జేసుకొన్న అధికారులపై వేటుపడింది. దీనితో రైతుల ఆనందానికి అవధుల్లేవు. అదే కామేశ్వరరావు సేవా దీక్షకు తొలి పునాది, ధైర్యం కూడాను. ఆ తరువాత కామేశ్వరరావు వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్కొక్కటిగా సమాజంలోని బడుగులను పీడిస్తున్న జలగల నుంచి విముక్తి కలిగించటం మొదలుపెట్టాడు. ఇలా గత 46 ఏళ్లుగా ఈ సామాజిక సంఘ సంస్కర్త సేవ చేస్తూనే ఉన్నాడు. ఇప్పుడాయన వయస్సు 85 సంవత్సరాలు.

1940 డిసెంబర్ 29న పీవీ సత్యనారాయణ, వెంకాయమ్మకు విజయవాడలో దుర్గా కామేశ్వరరావు జన్మించారు. తండ్రి సత్యనారాయణ హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఉద్యోగం. అందువల్ల కామేశ్వరరావు చదువంతా హైదరాబాద్‌లోనే సాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అణుభౌతిక విజ్ఞానశాస్త్రంలో ఎంఎస్సీ ప్రథమశ్రేణిలో పూర్తిచేసిన ఆయన, అణుపరిశోధనపై ఉన్న మక్కువతో సాహా ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చేశారు. ఈ కాలంలోనే అనేకమంది దేశీయ, విదేశీయ భౌతిక విజ్ఞానశాస్త్ర శాస్త్రవేత్తలతో ఏర్పడిన పరిచయంతో ఆయన తొలుత అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. అక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి తన పరిశోధనలను కొనసాగించారు. ఈ సమయంలో ఆయనకు సహచర శాస్త్ర బృందంతో కొన్ని భౌతికశాస్త్ర అంశాలలో వచ్చిన విభేదాల కారణంగా, ఆయన అమెరికాలోనే మరో విశ్వవిద్యాలయానికి మారటం జరిగింది. ఇలా రట్జర్స్ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ తీసుకొని, బోధనాచార్యుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలోని జాతి వివక్షకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాలను దగ్గరగా పరిశీలించి, వాటిలో భాగం పంచుకున్నారు. ఇక్కడే ఆయనకు తొలిసారి సామాజిక స్పృహ అన్నది మనిషికీ, శాస్త్రవేత్తకు ఒక్కటే స్థాయిలో అవసరం అన్న భావన కలిగింది. స్వదేశం గురించి ఆలోచించేందుకు అదే ఆయనకు తగిన ప్రేరణ నిచ్చింది. వందల ఏళ్ల పరాయి పాలనలో మగ్గిన తన దేశంలోనూ కుల, మత వివక్షలుండటం ఆయనను చాలా ఇబ్బంది పెట్టింది. తన స్వదేశ సమాజం ఎంతో వెనుకబడి ఉన్న సంగతి ఆయనను చాలా కలవరపెట్టింది. ఇందుకు తనవంతుగా తానేమి చేయగలడో తెలుసుకొనేందుకు ఆయన స్వదేశం తిరిగివచ్చారు. జిడ్డు కృష్ణమూర్తి తాత్వికాలోచనలు, జయప్రకాశ్‌నారాయణ జాతీయ ఉద్యమాలు, వినోబాభావే భూదాన్ ఉద్యమం వంటివి ఆయనకు కొత్తస్ఫూర్తిని ఇచ్చాయి. వాళ్లను స్వయంగా కలిసి మాట్లాడారు కూడా. రాష్ట్రం మొత్తం ఒకసారి పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి సమస్యలున్నాయో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ క్రమంలోనే నాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా ఆయనను ఆదిలాబాద్‌గానీ,



విజయనగరంకానీ, కార్యాచరణ క్షేత్రంగా ఎంచుకోమని చేసిన సూచనకు అనుగుణంగా విజయనగరం జిల్లాను ఎంచుకొన్నారు. గ్రామీణ దళితులూ, బడుగులు నిరక్షరాస్యత వలన దోపిడీకి గురవుతున్నారన్న గుర్తింపు ఆయనను కార్యోన్ముఖులను చేసే దిశగా నడిపింది. 'నిరక్షరాస్యతే అన్ని సమస్యలకు మూలం, చదువుతో అన్ని ఆలోచనలు మారిపోతాయి. ఒక జీవితం మారితే ఒక కుటుంబం మారిపోతుంది. కుటుంబాలు మారితే పల్లె మారుతుంది' అని భావించి కామేశ్వరరావు అక్షరాస్యతా ఉద్యమంపై దృష్టి సారించారు. 1979 జులై ఒకటిన చీపురుపల్లి మండలంలోని అప్పన్నవలసలో రాత్రిబడి ఆరంభించారు. ఆ అక్షరాలు అక్కడ పూరిగుడిసెలలో నివసించే బడుగులలో చైతన్యజ్యోతి వెలిగించాయి. క్రమంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలూ వచ్చి తమ ప్రాంతాలలో కూడా రాత్రిబడులు ప్రారంభించమని కోరారు. స్థానిక యువకుల సాయంతో కాపు సంభాలో మరో పాఠశాల ఆరంభించారు. అది కూడా విజయవంతమైంది.

గరివిడి, మెరకముడిదాం, పొందూరు మండలాలకు రాత్రిబడులు విస్తరించాయి. చదువంటే కేవలం అక్షరాలు రాయటానికి ఈ బడులు పరిమితం కాలేదు. ప్రభుత్వం బడుగుల కోసం, దళితుల కోసం ప్రకటించే పథకాలను వివరించేందుకు ఈ బడులు కీలకమైనాయి. క్రమంగా ప్రజల్లో అవగాహన పెరిగింది. యువ సంఘాల నేర్పరచి వారి సాయంతో స్థానికులకు ప్రభుత్వంతో సంబంధం ఏర్పరిచారు. అలా అధికారులు అవినీతికి పాల్పడే పద్ధతులు, వాటిని తిప్పికొట్టే సామర్థ్యం ప్రజల్లో కలగసాగింది. పేదల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములు పెత్తందారుల చేతుల్లోకి వెళ్లాయని తెలిసి వాటికోసం పోరాటానికి సిద్ధమయ్యారు. జిల్లా అధికారులు దిగివచ్చారు. పేదల భూములు పేదలకే ఇవ్వటం మొదలయింది. అలా వెట్టిచాకిరి చేసేవాడు కూడా భూయజమాని కాగలిగాడు. గ్రామస్థులకు ఆర్థిక ఆదాయం ఒనగూడితే దానిని నిలబెట్టుకోవడం, పెట్టుబడిగా మార్చుకోవటంపైన అవగాహన కల్పించటం గ్రామీణ వికాసంలో మరో ముఖ్యమైన అడుగు. ఈ అజెండాతో అప్పన్నవలసలో గ్రామీణ పొదుపు పథకం ఆరంభించారు. కూలికి వెళ్లే మహిళల్ని కలిసి పొదుపు ఉద్యమం లాభాలను బోధపర్చారు. ముందు చిన్నమొత్తాల పొదుపు లాభాలు వాళ్లకు నమ్మకం కలిగించాయి. 1980 నాటికి 200 మహిళా సంఘాలు ఈ పొదుపు ఉద్యమంలో భాగం అయ్యాయి. కాపుసంబామ్, కొండసంభామ్, బాగువలస, పెనుబర్తి, ఆకులపేట, దుమ్మెడ, కోనూరు, వంగపల్లిపేట గ్రామాలలో విజయాకాలనీలు వెలిశాయి. ఈ ప్రాంతాలలో ఉండే రిక్షా కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉండేవి. కామేశ్వరరావు అప్పటి జిల్లా కలెక్టర్ ఎస్ఆర్ శంకరన్‌ను కలిసిమాట్లాడారు. ఫలితంగా రిక్షా కార్మికులకు ఇళ్లస్థలాలు మంజూరయ్యాయి. వావిలాల గోపాలకృష్ణయ్య కాలనీకి శంకుస్థాపన చేశారు. రిక్షా కార్మికుల కోసం ఆసియాలోనే ఏర్పడ్డ మొదటి రిక్షా కార్మికుల కాలనీ ఇది. గత ఏడాది నుంచి రాష్ట్రంలోని ఎనభైవేల అంగనవాడీ కేంద్రాలలో బాలబడి నమూనాలో విద్యా విధానం అమలులోకి తెచ్చింది. ఇందిరాక్రాంతి పథంలో నడిచే 20,000ల బడులను కూడా కామేశ్వరరావు బాలబడి పద్ధతే రాష్ట్రం అమలు చేసింది. కామేశ్వరరావు 1983లో శోధన అనే విద్యాశిక్షణ కేంద్రం ఒకటి స్థాపించి ఈ బాలబడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించటం ఆరంభించారు. కామేశ్వరరావు త్యాగంలో పుచ్చలపల్లి సుందరయ్యలాంటి వాడు. పిల్లలు, వివాహం తన ఆశయాలకు ప్రతిబంధకాలవుతాయని భావించి ఒంటరిగానే జీవనయానం సాగించాడు. తనకంటూ ఏ ఆస్తి మిగుల్చుకోలేదు. హైదరాబాద్ నారాయణగూడలోని ఇల్లు అమ్మి బాలబడులకు కావలసిన ఏర్పాట్లు చేశాడు. స్వగ్రామంలోని పొలాల్ని అమ్మాడు. కాంట్రాక్టులకు దక్కకుండా గ్రామీణ నివాసాలు, రోడ్లు అన్నీ కార్మికులతోనే చేయిస్తున్నాడని, అందువల్ల తమ కాంట్రాక్టులు పోతున్నాయని, ఆదాయం రావట్లేదని కొంతమంది రాజకీయ నాయకుల ప్రేరేపణతో కామేశ్వరరావుపై కేసులు పెట్టారు. కొంతమంది ఆయనపై భౌతికంగా దాడి చేశారు. అయినా 85వ ఏట కూడా తన పని తాను చేసుకొంటూ పోతున్న ఒక మహానది చైతన్యరథి దుర్గా కామేశ్వరరావు. నిజానికి కామేశ్వరరావు గ్రామీణ వికాసానికి చేసిన సేవకు ఆయనకు రామన్‌మెగసెసే అవార్డు నుంచి నేటి కేంద్ర ప్రభుత్వ పద్మ అవార్డుల దాకా ఎన్నో అవార్డులు రావలసి ఉంది. రాజకీయం, సిఫార్సు లేనిదే అవార్డులు రావన్నది కామేశ్వరరావుతో సహా అందరికీ తెలుసు. అందుకే ఆయనను చూడలేదు. ఆచార్య దుర్గాకామేశ్వరరావు సేవలను గుర్తించి తెనాలి రోటరీక్లబ్, కుమార్ పంపు యాజమాన్యం, తెనాలి ప్రచురణలు, తెనాలివారు ఆయనకు అక్టోబర్ 30 న 'భారతజ్యోతిరత్న' పురస్కారం ఇస్తున్న సందర్భంలో ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మేలుకొంటాయని భావిద్దాం.

(పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావుకు నేడు 'భారత జ్యోతిరత్న' ప్రదానం సందర్భంగా...)

7671909759

ఎన్డీయేకు మెజారిటీయే నెహ్రూకు నివాళి

రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవా



దర్భంగ/పట్నా: 'బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నవంబరు 14న వెలువడనున్నాయి. ఆ రోజు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం. ఎన్డీయేకు రాష్ట్రంలో మూడో వంతు మెజారిటీ రావడమే ఆయనకు తగిన నివాళి' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. బీహార్‌కు గూండా రాజ్ అక్కర్లేదని, గతంలో ఆర్‌జేడీ ఆటవిక పాలనతో జరిగిన నష్టాన్ని సీఎం నితీశ్ కుమార్ చాలా వరకు పూడ్చారన్నారు. రాజ్‌నాథ్ సింగ్ బుధవారం పట్నా జిల్లాలోని బార్హ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ ఆర్‌జేడీపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్, ఆర్‌జేడీ దాడి చేస్తున్నట్లు ఆరోపించారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థల ప్రతిష్ఠ దిగజారిస్తే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగించగలదని వ్యాఖ్యానించారు. ఆర్‌జేడీ బీహార్ ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందా లేక ఆటవిక పరిపాలనలోకి వెళుతుందా అన్నది ఈ ఎన్నికలతో తేలిపోతుందని వ్యాఖ్యానించారు. అంతకుముందు దర్భంగలో నిర్వహించిన ర్యాలీలోనూ రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఆర్‌జేడీ ఇస్తోందని అన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తమ మేనిఫెస్టో గురువారం విడుదల అవుతుందని, అందులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 20 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన సీఎం నితీశ్‌పై అవినీతి ఆరోపణలు లేవని చెప్పారు. మాజీ సీఎం లాలు ప్రసాద్ యాదవ్ కుటుంబం మొత్తం అవినీతిలో కూరుకుపోయి ఉందని విమర్శించారు. పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని బుట్టదాఖలు చేస్తామంటూ ప్రతిపక్షం తప్పుడు హామీలు ఇస్తోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

మంటల్లో బస్సు బుగ్గి... ప్రయాణికులు సురక్షితం

ముంబై: మహారాష్ట్రలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ లగ్జరీ బస్సుకు మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రయాణికులు సురక్షితంగా బయటపడగా... ఆ బస్సు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. లగ్జరీ స్లీపర్ బస్సు ముంబై నుంచి జల్నాకు వెళ్తోంది. నాగపూర్ జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఆ బస్సుకు మంటలు అంటుకున్నాయి. ఇది గమనించిన డ్రైవర్ హుస్సేన్ సయ్యద్ బస్సును వెంటనే రోడ్డు పక్కన ఆపాడు. అందులో ఉన్న 12 మంది ప్రయాణికులను సకాలంలో నుంచి దించివేశాడు. ఆ తర్వాత ఆ బస్సు మంటల్లో పూర్తిగా కాలిపోయింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పేశారు. అంబులెన్సులు అక్కడకు చేరుకున్నాయి. ప్రయాణికులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. బస్సు కాలిపోవడానికి కారణం ఏమిటన్నదని దర్యాప్తు చేస్తున్నారు.

మేఘ మథనం విఫలం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన మేఘ మథనం విఫలమైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సమాచారం మేరకు... బుధవారం ఉదయం ఢిల్లీలో అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) 300 కంటే ఎక్కువగానే నమోదైంది. ఆనంద్ విహార్‌లో 312, ఐటీవో, అక్షర్ ధామ్ వద్ద 307, ఇండిగా గేట్ వద్ద 282గా గాలి నాణ్యత సూచీ నమోదైంది. దాదాపు 53 ఏళ్ల తర్వాత ఢిల్లీలో కాలుష్యం తగ్గించేందుకు క్లౌడ్ సీడింగ్ నిర్వహించింది. ఐఐటీ కాన్పూర్ సహకారంతో బురారి, ఉత్తర కరోల్ బాగ్, మయూర్ విహార్, బద్లి సహా వివిధ ప్రాంతాల్లో ట్రయల్స్ నిర్వహించింది. విమానం కాన్పూర్ నుంచి బయల్దేరి ఆరు వేల అడుగుల ఎత్తులో రసాయనాలను వెదజల్లింది. అయితే, వర్షాలు కురవకపోవడం అందరినీ నిరుత్సాహపర్చింది.

రూ.500కే వంట గ్యాస్: తేజస్వి

ముజఫర్‌పూర్: అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రతిపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ముజఫర్‌పూర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని తేజస్వి ఉద్ఘాటించారు. బీహార్ ప్రజల మద్దతు తమకున్నదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే గ్యాస్ సిలిండర్ ధరను రూ.500 చేస్తామని హామీనిచ్చారు. ఎన్డీయే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తమ నుంచి కాపీ కొట్టినవిగా చెబుతూ... 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని తేజస్వి గుర్తుచేశారు. ఈ హామీ అధికార వర్గం వెన్నులో వణుకు పట్టించింది కాబట్టే 125 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అలాగే, మహిళల పథకాలను ప్రస్తావించారు. నితీశ్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 'మాయి బెహిన్ యోజన', ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కూడా తామిచ్చిన హామీల నుంచి ప్రభావితమైనవేనని తేజస్వి తెలిపారు. 'మేము తోడ్పాటుకు హామీనిస్తే... ప్రభుత్వం రుణమిచ్చింది. వడ్డీతో పాటు వసూలు చేస్తుంది' అని ఆర్‌జేడీ నేత వ్యాఖ్యానించారు. నితీశ్ ప్రభుత్వాన్ని రిమోట్ కంట్రోల్ ద్వారా బీజేపీ నడిపిస్తోందన్నారు. బీహార్‌లో ఓట్లు అడుగుతూ గుజరాత్‌లో ఫ్యాక్టరీలు పెట్టే బయటవారి ప్రభుత్వాన్ని బీహారీలు గద్దె దించాలని పిలుపునిచ్చారు. తన కుటుంబంపై అవినీతి ఆరోపణలు, ఆర్‌జేడీ పాలనను ఆటవిక పాలనగా ఎన్డీయే ఆరోపించడాన్ని తోసిపుచ్చారు. ఈ రెండు వ్యవహారాల్లో రాజీ లేని కచ్చితమైన వైఖరితో ముందుకెళతామని తేజస్వి ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఓ ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్న హామీని పునరుద్ఘాటించారు. 'నక్రీ మిలేగా పక్కా... ఉమ్మీదో కా లగేగా ఛక్కా' (ఉద్యోగం తప్పక లభిస్తుంది.... ఆశలన్నీ కచ్చితంగా నెరవేరుతాయి) అని నినాదమివ్వగా... సభకు హాజరైన వారంతా చప్పట్లతో అభినందించారు. తేజస్వీ యాదవ్ ర్యాలీలో 'యువా కీ సర్కార్' (యువ సర్కారు) నినాదం మార్మోగింది.

తనయులకు పదవులే లాలు, సోనియా ఆకాంక్ష: అమిత్‌షా



దర్భంగ/సమస్తిపుర: ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ తన కుమారుడిని ముఖ్యమంత్రి చేయాలని కోరుకుంటుంటే, తన తనయుడిని ప్రధానిగా చూడాలని కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ ఆకాంక్షిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఈ రెండు పదవులు ఖాళీగా లేవంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ తరపున అమిత్‌షా బుధవారం బీహార్‌లోని దర్భంగ, సమస్తిపురలో నిర్వహించిన ప్రచార ర్యాలీలలో మాట్లాడారు. కాంగ్రెస్-ఆర్‌జేడీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే కేంద్రం నిషేధించిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులు జైళ్లలోనే ఉంటారా అంటూ అమిత్‌షా ప్రశ్నించారు. తమ పార్టీ యువతకు టికెట్లు ఇచ్చిందని, కాంగ్రెస్-ఆర్‌జేడీ అలా చేయలేదన్నారు. ప్రతిపక్ష మహాగట్బంధన్‌ను 'దొంగ బంధం' అంటూ విమర్శించారు. కాంగ్రెస్, ఆర్‌జేడీ అగ్రనేతలపై అవినీతి కేసులు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మళ్లీ ఆటవిక పాలన రాకూడదని, ఎన్డీయే 'పంచ పాండవుల' మాదిరి ఐదు పార్టీలతో బలంగా ఉందని, చారిత్రక విజయం సాధిస్తుందని అన్నారు. మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ బిరుదు 'జననాయక్'ను లాక్కోవాలని ఇండియా ఐక్య సంఘటన భావిస్తోందని, అలా ఎప్పటికీ జరగనివ్వమన్నారు. బాబు జగ్‌జీవన్‌రామ్‌ను ప్రధాని కానివ్వని కాంగ్రెస్ నిజరూపం ప్రజలకు తెలుసని అమిత్‌షా వ్యాఖ్యానించారు. బీహార్ అభివృద్ధి కోసం లాలు, రాబ్డీ దేవి చేసిందేమీలేదని అన్నారు. రాష్ట్రాభివృద్ధి, యువజన సంక్షేమం గురించీ మహాగట్బంధనకు ఆలోచన కూడా లేదని విమర్శించారు. దర్భంగకు త్వరలో మెట్రో రైలు, ఎయిర్‌పోర్టు రాబోతున్నట్లు తెలిపారు. ఎయిమ్స్ నిర్మాణంలో ఉందని అన్నారు. మిథిలాలో సీతాదేవి ఆలయ నిర్మాణం సాగుతోందని, ఆమె ప్రయాణించిన ప్రాంతాలను అనుసంధానం చేసి రామ్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రంథాల నిల్వ కోసం రూ.500 కోట్లతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అమిత్‌షా వెల్లడించారు.

పాక్‌తో సంబంధాలు... గూఢచారి అరెస్ట్

న్యూఢిల్లీ: గూఢచర్యానికి పాల్పడుతూ, నకిలీ పాస్‌పోర్ట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహమ్మద్ అదిల్ హుస్సైనీ(59)ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ అణు శాస్త్రవేత్తలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం... నిందితుడు హుస్సైనీ... మరో రెండుమూడు మారుపేర్లతో విదేశాల్లోని అణుశాస్త్రవేత్తలను పలుమార్లు సంప్రదించినట్లు, పాక్ సహా వివిధ దేశాలకు పర్యటించినట్లు వెల్లడించాయి. అతడు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి నుంచి అసలు, నకిలీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతలో కీలకమైన సంస్థలకు సంబంధించిన ఐడీ కార్డులు కలిగిఉన్నట్లు గుర్తించారు. అతడు ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడని, అక్కడ నకిలీ ఐడీలు, పాస్‌పోర్టులను తయారుచేస్తున్నాడని తెలిపారు. రష్యా అణుశాస్త్రవేత్త నుంచి డిజైన్‌ను ఇరాన్ శాస్త్రవేత్తకు విక్రయించినట్లు దర్యాప్తులో భాగంగా అదిల్ వెల్లడించినట్లు తెలిసింది. అదిల్ సోదరుడు అక్తర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కేఫ్ నడుపుతోన్న మరో అనుమాతుడిని అరెస్టు చేయగా... ఈ కార్యకలాపాల్లో భాగమైన మిగిలినవారు పరారీలో ఉన్నారని పోలీసు అధికారి ప్రమోద్‌సింగ్ కుశ్వాహ మీడియాకు వెల్లడించారు. వీరి ద్వారా ఎంతమందికి నకిలీ పాస్‌పోర్టులు అందాయనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఒక్కో ఉద్యోగానికి రూ.35 లక్షలు

తమిళనాడు సర్కారుపై ఈడీ ఆరోపణలు

చెన్నై: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో పాలక డీఎంకేపై ఈడీ అవినీతి ఆరోపణలు చేసింది. తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో భారీ కుంభకోణం జరిగినట్లు తెలిపింది. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25-35 లక్షల చొప్పున ముడుపులు తీసుకున్నట్లు వెల్లడించింది. ఓ మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. దీనిపై తమిళనాడు పోలీసు విభాగానికి తాజాగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఈ కుంభకోణం వెనక శక్తిమంతమైన రాజకీయ నాయకులు, ప్రముఖులు ఉన్నారని ఈడీ అధికారులు ఆరోపించారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలోని అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర పోస్టుల కోసం 2024లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభించారు. దాదాపు 1.12 లక్షల మంది ఈ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నియామక పరీక్ష నిర్వహించి 2,538 మందిని ఎంపిక చేశారు. ఈ ఏడాది ఆగస్టులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు. అయితే, ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఈడీ ఆరోపించింది. దాదాపు 150 మంది అభ్యర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్‌కు పాల్పడినట్లు పేర్కొంది. ఇందుకోసం ఆయా అభ్యర్థుల నుంచి రూ.25-35 లక్షల చొప్పున లంచాలు తీసుకున్నట్లు తెలిపింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌కు ఈడీ లేఖ రాసింది. ఈ ఆరోపణలకు సంబంధించి 232 పేజీల ఆధారాలు సమర్పించింది. పరీక్ష నిర్వహించిన అన్నా యూనివర్సిటీపై దర్యాప్తు చేయాలని ఈడీ కోరినట్లు ఆ కథనం వెల్లడించింది. దీంతో ఈ వ్యవహారం రాజకీయ దుమారం రేపింది. ఈ కథనాన్ని ప్రముఖ నటుడు విజయ్ పార్టీ టీవీకే తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది.

బీజేపీ రిమోట్ నితీశ్: రాహుల్

ముజఫర్‌పూర్: రాష్ట్రంలోని నితీశ్ కుమార్ నాయకత్వంలో సాగుతున్నది రిమోట్ కంట్రోల్ ప్రభుత్వమని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ విషయంలో మహాగట్బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్‌తో ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. రాహుల్ బుధవారం ముజఫర్‌పూర్‌లో నిర్వహించిన 'ఇండియా' ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ 'నితీశ్‌ను ముందర ఉంచి... బీజేపీ వెనుక నుంచి పరిపాలన సాగిస్తోంది. రాష్ట్రంలో ఉన్నది రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం' అని అన్నారు. నితీశ్ ముఖాన్ని బీజేపీ వాడుకుంటోందని విమర్శించారు. సామాజిక న్యాయానికి కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. ప్రతిపక్ష పార్టీ ఒత్తిడిని తట్టుకోలేకనే కుల గణనకు మోదీ ప్రభుత్వం అంగీకరించిందని రాహుల్ అన్నారు. 'రెండు భారత్‌లు ఆవిర్భవిస్తున్నాయి. ఒకటి సామాన్యుల దేశం కాగా మరొకటి ఐదుగురు లేదా పది మంది సంపన్నుల దేశం. అందుకోసమే బీహార్ పేదరికాన్ని అనుభవిస్తోంది' అని వ్యాఖ్యానించారు. ఛాఠ్ పూజ సందర్భంగా యమునా నదిలో పుణ్యస్నానం ఆచరిస్తానంటూ ప్రధాని మోదీ ఆడిన నాటకాన్ని అంతా చూశారు... ఆయన నది జలాలతో స్నానం చేయలేదని... పైపు ద్వారా సరఫరా చేసిన నీళ్లు' అని అన్నారు. 'దేశ పౌరులకు డేటా చవకగా లభిస్తోందని మోదీ గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ టెలికాం రంగంలోకి అనుమతించిన ఏకైక వ్యాపార సంస్థ గుత్తాధిపత్యాన్ని దాస్తున్నారు. నోట్ల రద్దు ద్వారా ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై మౌనం వహించారు' అని కాంగ్రెస్ నేత వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలలో ఓట్లను దొంగలించినట్లుగానే బీహార్‌లోనూ చేస్తారని ఆరోపించారు. 'ఇండియా' అధికారంలోకి వస్తే కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఓట్ల చోరీ రాజ్యాంగంపై దాడి... రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని అన్నారు. బీహార్ ఘన చరిత్రను గుర్తుచేస్తూ నలంద విశ్వవిద్యాలయాన్ని ప్రస్తావించారు. 'బీహారీలు దుబాయి, మారిషస్, సెచిల్లెస్, అమెరికా వంటి దేశాల్లో రాణిస్తున్నారు. మీ సామర్థ్యాన్ని తట్టి లేపాలి. నలంద విశ్వవిద్యాలయం...కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన నుంచి పుట్టింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికన్లు బీహార్‌కు వచ్చే రోజులు రావాలని కోరుకుంటున్నా' అని రాహుల్ అన్నారు. కేవలం సెకన్ల వ్యవధిలో రాజకీయ పరిస్థితులను అంచనా వేయగల సమర్థులని బీహారీలను ప్రశంసించారు. మోదీ ఆడే నాటకాలు చూసి మోసపోవద్దని కోరారు. ఓట్ల కోసం ఆయన అవసరమైతే స్టేజ్ మీద డ్యాన్స్ కూడా చేస్తారంటూ మోదీని రాహుల్ ఎద్దేవా చేశారు.

56 అంగుళాల ఛాతీ ఇంకా మౌనమా!

ట్రంప్ వ్యాఖ్యలపై మోదీకి కాంగ్రెస్ ప్రశ్న

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య వివాదాన్ని వాణిజ్యం ద్వారా ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరావృతం చేయడంపై కాంగ్రెస్ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించింది. 'స్వయంగా చెప్పుకున్నా కానీ ఇప్పుడు పూర్తిగా కుంచించుకుపోయిన, లోతుగా బహిర్గతమైన 56 అంగుళాల ఛాతీ ఇప్పటికీ నిశ్శబ్దంగా ఉంది' అని పేర్కొంది. జపాన్, తరువాత దక్షిణ కొరియాలో ట్రంప్ వ్యాఖ్యల వీడియో దృశ్యాలను కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ కమ్యూనికేషన్స్ జైరాం రమేశ్ 'ఎక్స్' లో పంచుకున్నారు. దీనిలో వాణిజ్యాన్ని ఉపయోగించి భారతదేశం-పాకిస్తాన్ సైనిక సంఘర్షణను ఆపానని ఆయన తన వాదనను పునరావృతం చేశారు. 'ఇప్పటివరకు ఆయన 54 సార్లు చెప్పారు. అమెరికా, ఖతార్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, బ్రిటన్‌లో ఆయన దీనిని చెప్పారు. ఆయన దీనిని విమానంలో, భూమిపై చెప్పారు. ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ నిన్న సాయంత్రం జపాన్‌లోని వ్యాపార నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ మళ్లీ చెప్పారు' అని ఆయన అన్నారు. 'న్యూఢిల్లీలోని ఆయన మంచి స్నేహితుడు ఇకపై ఆయనను కౌగిలించుకోవడం ఇష్టపడకపోవడంలో ఆశ్చర్యం లేదు' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. మరో పోస్ట్‌లో, బుధవారం ఉదయం దక్షిణ కొరియాలో వాణిజ్యాన్ని ఉపయోగించి భారతదేశం-పాకిస్తాన్ సైనిక సంఘర్షణను ఆపాననే ట్రంప్ చేసిన వ్యాఖ్యల వీడియో దృశ్యాన్ని ఆయన పంచుకున్నారు. 'కొన్ని నిమిషాల క్రితం దక్షిణ కొరియాలో జరిగిన ఎపెక్ సదస్సులో అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగిస్తున్నారు. మునుపటి కంటే సవివరంగా ఆపరేషన్ సిందూర్‌ను అకస్మాత్తుగా నిలిపివేయడం గురించి అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడటం ఇది 56వ సారి' అని పేర్కొన్నారు.

అది సమష్టి బాధ్యత: గడ్కరీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్లను ప్రవేశపెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పని చేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, నిర్మాణానికి మంజూరు చేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక వివరాలు వెల్లడవుతాయని చెప్పారు. 'స్మార్ట్ రోడ్ల భద్రత' అనే అంశంపై ఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఓ సమావేశంలో గడ్కరీ ప్రసంగించారు. రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని, మొత్తం వ్యవస్థ చేసిన తప్పునకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. 'రోడ్లపై క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, వారి ఫోన్ నంబర్లు, ఫొటో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుంది' అని అన్నారు.

వంద రోజులుగా ధన్కర్ మౌనవ్రతం!

వీడ్కోలు కార్యక్రమం జరగలేదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాజీనామా చేసినప్పటి నుంచి 100 రోజులుగా 'పూర్తి మౌనంగా' ఉన్నారని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఆయన పూర్వీకులందరిలాగే కనీసం వీడ్కోలు కార్యక్రమానికి ఆయన అర్హుడని ప్రతిపక్షాలు నొక్కి చెబుతున్నాయని అన్నారు. భారత రాజకీయ చరిత్రలో అపూర్వమైన సంఘటన జరిగి సరిగ్గా 100 రోజులు అయిందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇంఛార్జ్ కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 'హఠాత్తుగా, ఆశ్చర్యకరంగా జులై 21న రాత్రి ఆలస్యంగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాజీనామా చేశారు. ఆయన ప్రధానిని రోజురోజుకూ ప్రశంసిస్తున్నప్పటికీ ఆయన అలా చేయమని బలవంతం చేయబడ్డారనేది స్పష్టంగా ఉంది' అని జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 100 రోజులుగా రోజూ ముఖ్యాంశాల్లో ఉండే మాజీ ఉప రాష్ట్రపతి పూర్తిగా 'మౌనంగా... కనిపించని.. వినని' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా ఉన్న మాజీ ఉప రాష్ట్రపతి ప్రతిపక్షానికి గొప్ప స్నేహితుడు కాదని తెలిపారు. 'ఆయన ప్రతిపక్షాన్ని నిరంతరం, అన్యాయంగా వేధించేవాడు. అయినప్పటికీ, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా, ఆయన పూర్వీకులందరిలాగే కనీసం వీడ్కోలు కార్యక్రమానికి అర్హుడని ప్రతిపక్షం చెబుతోంది. అది జరగలేదు' అని అన్నారు. ధన్కర్ రాజీనామా తర్వాత ఉప రాష్ట్రపతి ఆయన రాజీనామా వెనుక ఉన్న కారణాలు ఆయన ఉదహరించిన ఆరోగ్య సమస్యల కంటే 'చాలా లోతైనవి' అని కాంగ్రెస్ పేర్కొంది.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

2న ఎస్ఐఆర్‌పై సమావేశంలో అన్ని పార్టీలు పాల్గొనాలి: స్టాలిన్

తెంకాశి(తమిళనాడు) : నవంబరు 2న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై జరగబోయే అఖిలపక్ష సమావేశం 'ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి' ఒక ప్రయత్నమని, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అన్ని పార్టీలు దీనికి హాజరు కావాలని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ బుధవారం అన్నారు. అధికార డీఎంకే, దాని మిత్రపక్షాలు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాయి. తదుపరి చర్యను నిర్ణయించడానికి ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే నెల నుంచి ఎన్నికలు జరగనున్న తమిళనాడులో, ఇతర రాష్ట్రాలలో ఈసీ ఎస్ఐఆర్‌ను అమలు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించిన తర్వాత సీఎం స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటువంటి కసరత్తు ద్వారా తమిళనాడు ప్రజల ఓటింగ్ హక్కులను 'కొల్లగొట్టడానికి' అధికార బీజేపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి విమర్శించారు. 'ఈ వేదిక నుంచి నేను పునరుద్ఘాటిస్తున్నాను. ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి ఆధారం. మేము దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ త్యాగం చేయము. ఓటు హక్కును లాక్కోవడం, ఓటు దొంగతనం వంటి బీజేపీ ప్రయత్నాలను అధిగమిస్తాం.

తమిళనాడు ప్రజల ఓటు హక్కులను కాపాడతాం. కేరళ మాతో చేరింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నుంచి ఎస్ఐఆర్‌పై ఉన్న వ్యతిరేకతపై సూచన వచ్చింది. అన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో ఈ ప్రయత్నంలో పాల్గొనాలి' అని స్టాలిన్ ప్రతిపాదిత అఖిలపక్ష సమావేశం గురించి అన్నారు.

ఎస్ఐఆర్ అమలును వ్యతిరేకిస్తాం: ప్రియాంక

వయనాడ్: పార్లమెంటు లోపల, వెలుపల చేసినట్లుగానే కేరళలో కూడా ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్ అమలును తమ పార్టీ వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తెలిపారు. వయనాడ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రియాంక, కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించాలనే ఎన్నికల కమిషన్ చర్య గురించి విలేకరుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'కేరళతో సహా అనేక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల ఎస్ఐఆర్‌ని అమలు చేయాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. మేము దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాం' అని ఆమె అన్నారు. 'వారు (ఈసీ) బీహార్‌లో దీన్ని ఎలా చేశారో చూస్తే, మేము పార్లమెంటులో, దాని వెలుపల దీనికి వ్యతిరేకంగా పోరాడాము. మేము ప్రతిచోటా దీనికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నాము' అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.

ఈ కసరత్తును 'ఎన్నికలలో మోసం చేయడానికి ఏకైక మార్గం' అని పేర్కొంటూ, బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ కసరత్తు 'ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని' ఆమె ఆరోపించారు. 'వారు బీహార్‌లో ఏమి చేశారో, అక్కడ ఎస్ఐఆర్‌ని ఎలా అమలు చేశారో మనం చూశాము. ప్రతి రాష్ట్రంలో వారు అలా చేయబోతున్నట్లయితే, అది ప్రజాస్వామ్యానికి అవమానం. దానిపై మనం పోరాడాలి' అని అన్నారు. బుధవారం ఉదయం ఆమె తన నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలప్పురం జిల్లాలోని ఎర్నాడ్‌లో కొత్తగా నిర్మించిన రాజీవ్ గాంధీ స్మారక ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీ భవనాన్ని ప్రారంభించారు.

ఎస్ఐఆర్ చేపడితే కాళ్లు విరగ్గొడతా

బీజేపీ, ఈసీకి బెంగాల్ మంత్రి హెచ్చరిక

కోల్‌కతా: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. పశ్చిమ బెంగాల్‌లోనూ ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ప్రకటించింది. దీనిపై బీజేపీ, ఈసీ లక్ష్యంగా రాష్ట్ర మంత్రి ఫిర్హాద్ హకీమ్ ఆరోపణలు గుప్పించారు. హకీమ్ వ్యాఖ్యలపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీ నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న హకీమ్... అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, ఈసీ కలిసి ఎస్ఐఆర్‌తో పౌరసత్వ సవరణ చట్టం అమలుకు యత్నిస్తున్నాయని ఆరోపించారు. వారు అలా చేస్తే... కాళ్లు విరగ్గొడతానని చెప్పారు. నిజమైన ఓటర్లను జాబితా నుంచి తప్పించేందుకు ఇదో ప్రయత్నమని మండిపడ్డారు.

పశ్చిమబెంగాల్ నుంచి ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా తొలగించేందుకు తాము అనుమతించమన్నారు. హకీమ్ వ్యాఖ్యలపై ఈసీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. బీజేపీ మాత్రం హకీమ్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. సీఎం మమతా బెనర్జీ సన్నిహితుడైన హకీమ్ ఎన్నికల కమిషన్ కాళ్లు విరగ్గొడతాననడాన్ని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఖండించారు. రాజ్యాంగ సంస్థపై టీఎంసీ బహిరంగ బెదిరింపులకు పాల్పడిందన్నారు. హింసను ప్రేరేపించడంతో పాటు అక్రమ చొరబాటుదారులను రక్షించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటు బ్యాంకు కోసం టీఎంసీ హింసను ప్రోత్సహిస్తుందా అని ఆయన ప్రశ్నించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రులు

- అత్యవసరం ఐతే తప్పా.. ఎవరూ సెలవు పై వెళ్లొద్దు
- ఆర్ అండ్ బి అధికారులు ఫీల్డ్ లెవెల్‌లో హై అలెర్ట్‌గా ఉండాలి
- అత్యవసరమైతేనే ప్రజలు రోడ్ల పైకి రావాలి
- అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి :మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మొంథా" తుఫాను ప్రభావం తో కురుస్తున్న భారీ వర్షాలతో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఎక్కడ ఇబ్బందులు ఉన్న అధికారుల దృష్టికీ తీసుకోవాలని తెలిపారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ,వాటర్ వర్క్ ,పోలీస్ ,విద్యుత్ ,హైడ్రా అధికారులు సమన్వయం చేసుకోవాలని పిర్యాదు వస్తె వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిల్వ ఉండకుండా సిబ్బంది ఉండేలా జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ స్థంబాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "మొంథా" తుఫాను ప్రభావం తగ్గే వరకు అధికారులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

మొంథాపైఅధికారులు ప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అప్రమత్తం చేశారు. బుధవారం ఆర్ అండ్ బి ఈఎన్సిలు, సిఈలు, ఎస్ఈలతో మంత్రి ఫోన్లో మాట్లాడారు. ఆర్ అండ్ బి అధికారులు ప్రతి ఒక్కరు ఫీల్డ్ లెవెల్‌లో హై అలెర్ట్‌గా ఉండాలనీ, అత్యవసరం అయితే తప్పా ఎవరూ సెలవు పై వెళ్లొద్దనీ మంత్రి స్పష్టం చేశారు. మాన్సూన్ సీజన్‌లో ఆర్ అండ్ బి ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో చేపట్టిన జాగ్రత్త చర్యలు ప్రశంసనీయమని.. అదే స్ఫూర్తినీ ఈ సమయంలో కొనసాగించాలనీ అన్నారు. లో కాజ్‌వేలు,కల్వర్టులు వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలనీ, ప్రజలను అప్రమత్తం చేయడానికి పోలీసు, రెవెన్యూ,విద్యుత్, ఇరిగేషన్, పిఆర్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ అన్ని జిల్లాలతో అనుసంధానం చేయాలనీ,ఆర్ అండ్ బి సర్కిల్ వారిగా అన్ని జిల్లాలలో పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.ఎమర్జెన్సీ ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలనీ,అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే ప్రజలు రోడ్ల పైకి రావాలనీ, అధికారులు సూచించే జాగ్రత్తలు పాటించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఐక్యత పాదయాత్రలో యువత విరివిగా పాల్గొనాలి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలు నేపథ్యంలో ఐక్యత పాదయాత్ర (యూనిటీ మార్చ్) చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలు నేపథ్యంలో జిల్లాలోని ఐక్యత పాదయాత్ర నిర్వహణ సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సమన్వయ సహకారంతో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు తెలిపారు. యువత భాగస్వామ్యం అలాగే భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. అలాగే త్వరలో ఐక్యత పాదయాత్రలు (యూనిటీ మార్చ్) కార్యక్రమంలో జిల్లాలోని యువత ఎక్కువగా పాల్గొనేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎన్సిసి శాఖలు అలాగే స్వచ్ఛంద సంస్థలు విరివిగా పాల్గొనాలని సూచించారు. జాతీయ సమైక్యతను ప్రోత్సహించడానికి కేంద్ర యువజన సర్వీసులు, క్రీడ మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. జయంతి నేపథ్యంలో అక్టోబర్ 10 నుంచి నవంబర్ రెండు వరకు జాతీయస్థాయిలో వ్యాసరచన, లఘు చిత్రాల పోటీలు, క్విజ్ పోటీలు my bharath. gov. In వెబ్సైట్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని తదుపరి డిసెంబర్ మొదటి వారం లేదా రెండవ వారం లలో బహుమతులు ప్రధానం ఉంటుందని యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని అన్నారు. పోటీలలో పాల్గొనే అభ్యర్థులు 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల లోపు వారు పాల్గొనాలని తెలిపారు. మీడియా సమావేశంలో డిస్టిక్ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ కుష్బూ గుప్తా, జిల్లా యువజన క్రీడల అధికారి సుధాకర్, యూత్ ఆఫీసర్ సైదా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ గర్ల్స్ హైస్కూల్‌కు కొత్త శోభ

విశాలాంధ్ర, హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ చొరవ మరియు ఆధ్వర్యంలో, నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ గర్ల్స్ హై స్కూల్ ప్రాంగణానికి కొత్త మెరుగులు అద్దేందుకు పెయింటింగ్ ప్రారంభించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి యునైటెడ్ వే, ఏ. ఏ కన్స్ట్రక్షన్ అండ్ డెవలపర్, మరియు వెల్స్ ఫార్గో అనే ఎన్‌జీఓలు సహకారం అందించాయి. ఈ ముఖ్య కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హైదరాబాద్ బ్రాంచ్ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి గారు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (హెచ్.ఎం.) సుచిత్ర మరియు ఎన్జీవో సభ్యులు మురళి కృష్ణ, యశ్వంత్, షేక్ అజార్ ప్రారంభించారు. మామిడి భీమ్ రెడ్డి మాట్లాడుతూ, 'పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడం మరియు విద్యార్థులకు మెరుగైన వాతావరణాన్ని అందించడం అనేది సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత. ఈ మంచి పనిలో భాగమైన ఎన్‌జీఓల సేవలు అభినందనీయం' అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎం.బి కృష్ణ యాదవ్ టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కే విద్యాసాగర్ హైదరాబాద్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అందే శ్రీధర్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ కంచుమర్ కాన్సన్ట్రేషన్ ఆఫ్ ఇండియా రవికుమార్ ,పాఠశాల సిబ్బంది మరియు 60 మంది ఎన్‌జీఓల వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఈవీఎంల రెండో విడత రాండమైజేషన్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఏర్పాట్లలో భాగంగా, బుధవారం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో రెండో విడత ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ రంజిత్ కుమార్, పోలీస్ అబ్జర్వర్ ఓం ప్రకాశ్ త్రిపాఠీ, వ్యయ పరిశీలకుడు సంజీవ్ కుమార్ లాల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల ఏజెంట్లు సమక్షంలో ఈసీఐ మార్గదర్శకాలు పారదర్శకంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ ఆఫీసర్ పి. సాయిరామ్ తదితర ఎన్నికల అధికారులు హాజరయ్యారు. ఈ రాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను నిష్పక్షపాతంగా కేటాయించడం జరుగుతుంది.

ఎన్నికలలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

విశాలాంధ్ర, హైదరాబాద్ : పోలింగ్ కేంద్రంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పష్టంచేశారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకూ ప్రతి అంశాన్నీ వారు పరిశీలించి సాధారణ పరిశీలకులకు నివేదిక పంపాల్సి ఉంటుందన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో ఎన్నికల విధులు బాధ్యతలపై జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక విధుల్లో పాల్గొనే 120 మందికి పైగా సూక్ష్మ పరిశీలకులకు ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సూక్ష్మ పరిశీలకులు సాధారణ పరిశీలకుల నియంత్రణలో పని చేస్తారనీ అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వీరు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణ, పోలింగ్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. నిబంధనలు మేరకు ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. పోలింగ్ రోజున పరిశీలించిన అంశాలను వారికి ఇచ్చిన ఫార్మాట్‌లో పూరించి అబ్జర్వర్‌కు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్, శిక్షణ నోడల్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : నగరంలో కురుస్తున్న భారీ వర్షాలవల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఈఆర్‌టీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం ఆయన సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ లు (ఈఆర్టీ), ఎస్పీటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని.. ఈ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని.. అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఈడీ

భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సైతం నగరంలోని ఓ అండ్ ఏం డివిజన్.6 పరిధిలోని ఎస్.ఆర్.నగర్, వెంకటగిరి, యూసుఫ్‌గూడ ప్రాంతాలలో సీజీఎం జీఎంలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అయన స్థానికంగా లో -ప్రెషన్ ఫిర్యాదులపై చర్చించి, త్వరగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే మాన్ హెల్స్ పూడికతీతలో ఉపయోగిస్తున్న ఎయిర్‌టెక్ మెషిన్ కార్యకలాపాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏఎంఎస్ భాగంగా చేపట్టే పనుల ప్రగతిని సమీక్షించి, కలుషత నీటి, సీవరేజ్ ఓవర్‌ఫ్లోలు తదితర పెండింగ్ ఏంసిసీ ఫిర్యాదుల పురోగతిని ఆరాతీశారు.

31న డీఈవో కార్యాలయాల ముట్టడి జయప్రదం చేయండి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే, డి ఈ. ఓ, కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ వంట కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచకుండా, నాణ్యమైన భోజనాలు అందించాలని, మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఇప్పటికే 11 నెలల అల్పాహారం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వేతనాలు 8 నెలలుగా పెండింగ్‌లోనే ఉంటే, వంట కార్మికులు వంటలు ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీశారు. ఒక్క కూరకు డబ్బులు చెల్లిస్తూ, రెండు కూరలు వడ్డించాలని ఒత్తిడి చేస్తే, ఆ నష్టం ఎవరు భరించాలన్నారు. అలాగే కోడిగుడ్డుకు ప్రభుత్వం ఆరు రూపాయలు చెల్లిస్తే, మార్కెట్‌లో రూ.7 నుంచి 8 వరకు లభిస్తున్నది. మరి ఈ నష్టాలు ఎవరు చెల్లిస్తారన్నారు. దానితో పాటుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానం ప్రకారం రూ. 10,000 వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని అధికారులను సంప్రదిస్తే ఏమాత్రం పట్టించుకోకపోవడం వలన ప్రభుత్వం దృష్టికి మా సమస్యలు తీసుకుపోవాలని లక్ష్యంతో, తప్పనిసరి పరిస్థితులలో ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలలో వంటలు బందు చేసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల ముట్టడినికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఏఐటీయూసీ నాయకత్వం, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకత్వాలు, అంకిత భావంతో పాల్గొని జయప్రదం చేయాలని ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామని, అలా జరుగని పక్షంలో నవంబర్ 12న కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి, చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు.

అప్రమత్తంగా ఉండండి : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : తుపాన్ నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లా అధికారులతో మంత్రి సితక్క టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు మరియు పశువుల కాపరులు తమ పశువులు, పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయరాదని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు తీర్చాలని సూచించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని మంత్రి సీతక్క కోరారు.



నవీన్ యాదవ్ గెలుపుకు ములుగు నాయకుల ప్రచారం....

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ నేతృత్వంలో వారు మంత్రి సీతక్కను ప్రజా భవన్‌లో కలిసి సమావేశమయ్యారు. సమావేశంలో పార్టీ విజయం కోసం చేపట్టాల్సిన వ్యూహాలపై మంత్రి సీతక్క పలు కీలక సూచనలు చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చాలని, అదే సమయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ, బీజేపీ%-%బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య పొత్తును ప్రజలకు బహిర్గతం చేయాలని సూచించారు. నవీన్ యాదవ్ విజయం ఖాయమే అయినప్పటికీ, అతి విశ్వాసం వద్దని ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా సమగ్రంగా ప్రచారం కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు.

కనీస వేతన జీవోల సవరణ ఏక్కడా: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఐదేళ్లకొకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన జీవోలు సవరించాల్సి ఉన్న ప్రభుత్వ అధినేతల అలసత్వం కారణంగా 14 ఏళ్ళు గడుస్తున్న కనీస వేతన జీవోలు సవరణ ఏది అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో పి.సురేష్ మాట్లాడుతూ 2012 సంవత్సరంలో అవిభాజ్య ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతన జీవోలను సవరించిందని అప్పటినుండి ఇప్పటివరకు కనీస వేతన జీవోలు సవరణకు నోచుకోలేదని మండిపడ్డారు. స్వరాష్ట్ర తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని హామీ నెరవేర్చక పోగా కార్మిక చట్ట ప్రకారం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన జీవోలను సవరించి వేతనాలు అందించాలని ఉన్న అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దీని ఫలితంగా కార్మికులు తీవ్రమైన ఆర్థిక శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కూడ అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న అతిగతి లేదని అన్నారు. తెలంగాణ కనీస వేతన బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా కనీస వేతనాలు రూ.20257 రూపాయలు అందించాలని ఏకగ్రీవంగా ఆమోదించి ప్రభుత్వానికి నివేదికలు అందజేసి నెలలు గడుస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్మిక వర్గం సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తే కార్మిక వర్గ ఆగ్రహ జ్వాలలు చవిచూడాల్సి వస్తుందని అన్నారు. పిఎఫ్ పరిమితి 15 వేల నుండి 30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్ వేతనం తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు నరసింహ, నాయకులు కార్మికులు శేఖర్, రామకృష్ణ, నవీన్, మల్లేష్, పేర్మల్, సుక్కమ్మ, మన్నెమ్మ, శివలీల, విజయలక్ష్మి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వి.చరణ్ కుమార్ మృతికి నివాళి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : వి.చరణ్ కుమార్ (34) అకస్మికంగా మృతి చెందారు. రాచకొండ కమిషనరేట్‌లో ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఏఎన్‌బి)లో డిప్యూటేషన్‌లో పని చేస్తున్నారు. 2025 సెప్టెంబర్ 23న ముంబై ఆపరేషన్ ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో వాహనం ప్రమాదానికి గురైంది. అందులో ఆయన కాలుకు గాయమైంది. మొదట స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. గాయం మానకపోవడంతో యశోద ఆసుపత్రి, మలక్‌పేట్‌లో డాక్టర్లు సర్జరీ చేయాలని సూచించారు. అక్టోబర్ 16, 24 తేదీలలో రెండు సర్జరీలు జరిగాయి. 24 అక్టోబర్ మధ్యాహ్నం 1.30కు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంటికి చేరుకున్న కొద్ది సేపటికి అయన అనూహ్యంగా మూర్చపోయారు. వెంటనే యశోద ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ డాక్టర్లు అయనను పరిశీలించి మృతి చెందినట్లు ప్రకటించారు. రాచకొండ సిపి సుధీర్ బాబు బుధవారం యశోద ఆస్పత్రికి వెళ్ళి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు స్కూల్‌కి వెళ్లే పిల్లలున్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి : మంత్రి శ్రీహరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం బొల్లారం గ్రామంలో కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోయిల సాగర్ రిజర్వాయర్లో 12 లక్షల రూపాయలతో 7లక్షల 77 వేల చేప పిల్లలకు మొదటి విడతగా 2 లక్షల 50 వేల చేప పిల్లలను పంపిణీ చేశారు. మిగతావి రెండు దశల్లో విడుదల చేస్తారు. ఈ సందర్భంగా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం దాదాపుగా రూ.123 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. రూ.94 కోట్లతో 84 కోట్ల చేప పిల్లలను రాష్ట్రంలోని దాదాపుగా 26000 నీటి వనరుల్లో,29 కోట్ల రూపాయలతో 300 చెరువులలో 10 కోట్ల రొయ్యలను వంద శాతం సబ్సిడీ తో విడుదల చేస్తున్నామని తెలిపారు.చేపల పెంపకంతో మత్స్యరంగంపై ఆధారపడ్డ 5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి కలుగనున్నట్లు తెలిపారు. మక్తల్ నియోజకవర్గంతో పాటు దేవరకద్ర, నారాయణపేట నియోజకవర్గాల అభివృద్ధికి తాను ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. గత పాలకులు 10 సంవత్సరాల్లో చేప పిల్లల ఉత్పత్తి పై దృష్టి పెట్టలేదని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్లో మొట్ట మొదటి సారి ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన తనకు మంత్రి పదవి ఇచ్చారని అన్నారు. తాను క్యాబినెట్ మంత్రి అయిన తర్వాత మత్స్య శాఖకు కేటాయించిన బడ్జెట్ పెంచాలని అడిగిన వెంటనే దాదాపుగా రూ.123 కోట్లు చేపల ఉత్పత్తికి కేటాయించారని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేయడంతో పాటు చేపల సంఖ్య,చేపల రకాలు,సైజు,మత్స్య సహకార సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డును చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవరకద్ర శాసన శాసనసభ్యులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గెలిచిన రెండు సంవత్సరాలలో సుమారు రూ.500 కోట్ల రూపాయల వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. గత పాలకుల వల్ల రాష్ట్రంలో అన్ని విభాగాలు విధ్వంసం అయిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా, ఉద్యోగాలు, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఇచ్చిన హామీలకు కట్టుబడి పని చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధి అజెండాతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజలందరు ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మత్స్య శాఖ డి.డి.ఖదీర్ అహ్మద్, మత్స్య శాఖ ఏ .డి. రాధా రోహిణి,మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజాసేవే మా పరమావధి :మాగంటి సునీత

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : ప్రచారానికి, ప్రజలతో మమేకం కావటానికి వర్షం అడ్డంకి కాదని ఆత్మస్థైర్యం ముఖ్యమని నిరూపించారు మాగంటి సునీతమ్మ. బుధవారం శ్రీనగర్ కాలనీ డివిజన్ లోని వడ్డెర బస్తి, సుభాష్ నగర్ లలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా తో కలసి జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ వర్షాన్ని లెక్క చేయకుండా గడపగడపకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. కాలనీవాసులు ఆత్మీయంగా పలకరించి గోపన్న సేవలను మర్చిపోమని, జూబ్లీహిల్స్ గడ్డపై బీఆర్ఎస్ జెండా తప్పకుండా ఎగిరి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం సైతం లెక్కచేయకుండా నవీన్ యాదవ్ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడ, ఇమామ్‌గూడ.. అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో ఈరోజు కుండపోత వర్షం కురుస్తున్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లారు. గొడుగు లేకుండా వర్షంలో తడుస్తూ ప్రతి ఇంటి వద్దకు చేరి ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి, వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. నవంబర్ 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపైన ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపించి జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రజలందరూ తోడ్పడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సోమాజిగూడ డివిజన్ ఇన్చార్జి భువనగిరి ఎంపీ చామాల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్, కార్పొరేటర్ సంగీత శ్రీనివాస్ యాదవ్, రియాజ్, జయరాం, గౌంటి సాయి యాదవ్ , స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో ఆగం పండు ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్,టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దూసక గిరి,కాసాని మహేష్ ముదిరాజ్,కేశం నరేష్,రాపోలు బాలు,నవీన్, రాజేష్, మహమ్మద్ షకీల్,నందిగామ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రచారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ బై పోల్ కి సమయం దగ్గర పడుతున్న కొద్ది, రసవత్తరంగా మారుతుంది. త్రికోణ పోటీ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఇంటి ఇంటికి ప్రచారంలో పాల్గొన్నారు. సునీతకి మద్దతుగా బుధవారం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా సోమాజిగూడ డివిజన్‌లోని ఎల్లారెడ్డిగూడలో పలు అపార్టుమెంట్ వాసులతో సమావేశమై వారిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర మొయినాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి ప్రజాపాలనపై వివరించాలని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ సూచించారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు నవీన్ యాదవ్‌ను కలిసి ఆయనకు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన భాధ్యత అందరికిపై ఉందని చెప్పారు. 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కుటుంబ పాలన గురించి కూడా ప్రజలకు వెళ్లి వివరించాలని సూచించారు. తనకు మద్దతుగా మొయినాబాద్ మండలం నుంచి వచ్చి ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నవీన్యాదవ్ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గౌంటి శ్రీనివాస్ యాదవ్, పల్లగొల్ల అశోక్ యాదవ్, బైకని మల్లేష్ యాదవ్, అత్తపురం సదానందం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో కమిషనర్‌ల పరిశీలన

విశాలాంధ్ర, హైదరాబాద్ : మొంథా తీవ్ర తుపానుతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లక్డికపూల్ పరిసర ప్రాంతాలను బుధవారం హైడ్రా, జీహెచ్ ఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్, ఆర్ వీ కర్ణన్‌లు సంయుక్తంగా పరిశీలించారు. మాసబ్ ట్యాంకు నుంచి లక్డికపూల్ వైపు వస్తున్నప్పుడు మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు రోడ్డు మీద నిలవడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఇరువురు కమిషనర్లు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇక్కడ ఇరువైపులా రోడ్డును తవ్వి రెండు ఫీట్ల విస్తీర్ణంతో ఉన్న పైపులైన్లను వేశామ, వాటికి మహవీర్ ఆసుపత్రి పరిసరాలతో పాటు చింతలబస్తీ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు, వరద నీటిని అనుసంధానం చేయాల్సినవసరం ఉందన్నారు. త్వరితగతిన ఈ పనులు కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈలోగా మహావీర్ ఆసుపత్రి ముందు నుంచి మెహిదీ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు పక్కగా ఉన్న పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే.. సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని కమిషనర్లు సూచించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించి పైపులైన్ల అనుసంధాన పనులు త్వరగా జరిగేలా సహకరించాలని సూచించారు. లకడికాపూల్ పరిసరాలను సందర్శించిన వారిలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ కమిషనర్లు వున్నారు

అమరులైన పోలీసుల సేవలు గుర్తు చేసుకోవాలి : సీపీ

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని, మెరుగైన సమాజం కోసం ప్రజలు యూనిఫామ్ లేని పోలీసులేనని రాచకొండ సిపి సుధీర్ బాబు అన్నారు. బుధవారం సరూర్ నగర్ స్టేడియంలో రాచకొండ సిపి సుధీర్ బాబు ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2000 మందితో ప్రోగ్రాం నిర్వహించారు. సుద్దాల అశోక్ తేజ, సుధీర్ సంద్ర, డా, కవిత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్లో, ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ... సమాజంలో ప్రజలకు సేవలందించి అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకునేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రాచకొండ పోలుసులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాచకొండ కమిషనరేట్‌లో ప్రతి ఒక్క నిమిషానికి రెండు డయాల్ 100 ఫోన్ కాల్స్ అటెంప్ట్ చేస్తున్నామని, పోలీసులు అన్ని రకాల సేవలను ఏక కాలంలో పని చేసి ప్రజలకు ఆరు విభాగాలుగా ఏర్పడి విజిబుల్ పోలిసింగ్‌లో భాగంగా సేవలు అందిస్తు, ప్రజలకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పిల్లలకు దూరంగా ఉండే సీనియర్ సిటిజెన్స్‌కి వారి ఇంటింటికి వెళ్లి సహాయ సహకారం అందిస్తున్నామన్నారు. ఆపరేషన్ స్మైలీతో ప్రజలకు దగ్గర కావడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యమని, దేశంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు భవిష్యత్తు అందించామని గుర్తు చేశారు. ప్రజల కోసం విధులు నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మెరుగైన సమాజం కోసం ప్రజలు యూనిఫామ్ లేని పోలీసులేనన్నారు. ప్రజలకు సేవలంధించే క్రమంలో పోలీసులు ప్రాణాలు కోల్పోతున్న సంగతి అందరికీ తెలిసిందేనని, దేశంలో ఎన్.బి.డబ్ల్యూ ఫ్రీ కమిషనరేట్‌గా రాచకొండ కమిషనరేట్ నిలిచింది రాచకొండ సిపి సుధీర్ బాబు గుర్తు చేశారు. ప్రజలకు సేవలంధించే పోలీసుల సేవలను ప్రజలు గుర్తించాలి, ప్రజలకు అందించే సేవలను తెలియజేసేందుకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు.అనంతరం సుద్దాల అశోక్ తేజ్ మాట్లాడుతూ... పోలీసులతో, ప్రతి ఒక్కరితో మనం కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ ఉన్నట్లు మనం కూడా ఫ్రెండ్లీ సిటిజెన్ లాగా ఉండాలని, దేశం కోసం, మనం ఎంత ప్రశాంతంగా ఉంటున్నామో దానికి కారణం పోలీసులేనని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అనంతరం కొన్ని పాటల రూపంలో ప్రజలు ఎలా ఉండాలో తెలిపారు. సుధీర్ సంద్ర మాట్లాడుతూ.. సోషల్ మీడియాకు విద్యార్థులు ఎంత దూరం ఉండాలో, సమాజంలో ఎలా మెదలాలో సూచించారు. పోలీసులు పడుతున్న కష్టాలని కళ్ళకి కట్టినట్లు చూపించి పోలీసుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, డ్రగ్స్, గంజాయి, ర్యాగింగ్ తదితర వాటిపట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి పద్మజా, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, యాదాద్రి భువనగిరి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిరా, డీసీపీ విమెన్ సేఫ్టీ ఉషా రాణి, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, ఎస్బి డీసీపీ జి నరసింహ రెడ్డి, డీసీపీ ఎస్ఓటి రమణ రెడ్డి, డీసీపీ ట్రాఫిక్ -1 శ్రీనివాస్, డీసీపీ ట్రాఫిక్ -2 శ్రీనివాసులు, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, డీసీపీ హెడ్ క్వార్టర్ శ్యామ్ సుందర్, అడిషనల్ డీసీపీలు, ఏసిపిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : గాంధీ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు మొంథా తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలందరూ అప్రమత్రంగా ఉండాలని , వర్షాల వల్ల ఎటువంటి సమస్యలు ఎదురైన మా దృష్టికి తీసుకురావలని ప్రజలకు పీఏసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ సూచన ల మెరకు అప్రమత్రంగా ఉండలని,మొంథా తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నా భారీ వర్షాల కారణంగా, ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని, అత్యవసరం తప్పితే ఎవరు బయటకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని , ఎటువంటి ఇబ్బందులు కలిగిన, (ఎలక్ట్రికల్,రోడ్డు,డ్రైనేజీ ,మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన , వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదిం చవల్సిందిగా మనవి అని తెలిపారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండలని కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని , జీహెచ్ఎంసీ అధికారులు ,హైడ్రా సిబ్బంది, మరియు మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ ,డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండలన్నారు.

ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలంటే కేసీఆర్ ప్రభుత్వం రావాలి : సబితా

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలంటే రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో రావులపల్లి, ముడిమ్యాల పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, కె. మధు, లక్ష్మణ్ కుమార్, బూర్ల మల్లేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీనీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల వలే పనిచేయాలని సూచించారు. తెలంగాణ సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఆలుపెరగని పోరాటం చేసిందని గుర్తు చేశారు. ప్రజలకు చేతకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తొందరలోనే తగిన బుద్ధిచెబుతారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పేరుతో పేద ప్రజలను మోసం చేస్తుందని అవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ ఎప్పుడు అన్యాయం చేయదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు వంగ శ్రీధర్ రెడ్డి, సినియర్ నాయకులు గోనె కరుణాకర్ రెడ్డి, శేరి రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ మాధవరెడ్డి, ముడిమ్యాల మాజీ సర్పంచ్ శేరి స్వర్ణలత దర్శన్, మాజీ ఉప సర్పంచులు శేరి శ్రీనివాస్, గోనే మాధవ్ రెడ్డి, నాయకులు బి. శ్రీనివాస్, మధుసూదన్ గౌడ్, కె. రాము, బి. శివ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మొయినాబాద్ : దక్షిణ తెలంగాణ వైపుకు మొంథా తుపాన్ దూసుకొచ్చిన నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల శాసనసభ్యులు యాదయ్య విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... తుపాన్ ప్రభావం కారణంగా బలమైన గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలని, విద్యుత్ తీగలు, చెట్లు కూలే ప్రమాదం ఉన్న ప్రాంతాల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు, వృద్ధులు ఇంటి లోపలే ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా,మండల ఎంఆర్‌వోలు, ఎంపిడిఓలు, గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రత మన ప్రాధాన్యమని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులను సంప్రదించాలని తెలిపారు.

నో యాక్షన్... ఓన్లీ కలెక్షన్!

- టౌన్ ప్లానింగ్‌నా... టిప్ ప్లానింగ్‌నా?
- రాజకీయ ముసుగుతో రక్షణ?
- నల్లగండ్ల హుడా లేఔట్‌లో ఏడు అంతస్తుల అక్రమ భవనం -
- నిద్రలో జీహెచ్ఎంసీ ?

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా లేఔట్‌లో అనుమతి మూడు అంతస్తులకే... కానీ నిర్మాణం మాత్రం ఏడు అంతస్తులు! స్పష్టమైన ఆధారాలతో వార్తలు వెలుగులోకి వచ్చినా జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. "నోటీసులు ఇచ్చాం" అన్న ఒకే సాకుతో అధికారులు బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'కలెక్షన్ సిగ్నల్' వచ్చిందా?

గత వారం వెలుగులోకి వచ్చిన ఈ అక్రమ నిర్మాణం పైభాగంలో ఇప్పుడు పగలు-రాత్రి తేడా లేకుండా పనులు కొనసాగుతున్నాయట. 'అధికారుల మౌనం అంటే... పైనుండి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టే కదా!' అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ శాఖ చర్య తీసుకోవాల్సిన దానిపై కూల్చివేత కాకుండా 'కూల్ సైలెన్స్' చూపుతుండటం జీహెచ్ఎంసీ వ్యవస్థలో గంభీర అనుమానాలకు తావిస్తోంది.

టౌన్ ప్లానింగ్‌నా... టిప్ ప్లానింగ్‌నా?

నగరంలోని అనేక ప్రాంతాల్లో ఇదే ధోరణి కొనసాగుతుందంటూ సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలు బయటపడితే సీజ్ చేయడం బదులు 'సెట్టింగ్'తో సర్దుకుంటున్నారని ఆరోపణలు మోగుతున్నాయి. "టౌన్ ప్లానింగ్ శాఖ ఇప్పుడు టిప్ ప్లానింగ్ శాఖగా మారిపోయింది" అని స్థానికులు కటువుగా విమర్శిస్తున్నారు. ప్రతి ఫైల్ కదలడానికి 'టిప్' తప్పనిసరిగా మారిందనే మాటలు అధికార వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి.

రాజకీయ ముసుగుతో రక్షణ?

ఈ భవనానికి వెనుక ఉన్నవారు ప్రభావశీలు అని తెలిసినా... అధికార దస్త్రాల్లో వారి పేర్లు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. "ప్రభావశీలుల ప్రాజెక్టు" అన్న ట్యాగ్ పడగానే ఫైల్ కదలకపోవడం, అధికారులు బలహీనతగా చూడాలా లేక లాభం కోసం మౌనంగా ఉండడమా అనే చర్చ నడుస్తోంది.

భాగ్యనగరం భవిష్యత్తు ఏదవుతుంది?

భాగ్యనగరంలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు నియంత్రణ లేకుండా సాగితే రేపు ప్రతి కాలనీ 'మినీ బంజారాహిల్స్'లా మారిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవన నిర్మాణ నిబంధనలు, సురక్షా ప్రమాణాలు అన్నీ పక్కన పెట్టి ఎవరు కావాలంటే వారు ఆకాశమంత ఎత్తైన కట్టడాలు కడితే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి.

'యాక్షన్' లేకపోతే 'కలెక్షన్ డిపార్ట్‌మెంట్'గానే మిగిలిపోతుంది!

ప్రజావాణిలో పదేపదే ఫిర్యాదులు చేసినా అధికారుల మౌనం చెదరలేదు. కూల్చివేతల బదులు కూల్ సైలెన్స్... విచారణల బదులు విచిత్రాలు! ఫీల్డ్‌లో ఏడు అంతస్తులు కట్టినా, ఫైల్‌లో మాత్రం మూడు అంతస్తులే చూపించడం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ శాఖ వ్యవస్థ ఏ స్థాయికి దిగజారిందో చెబుతోంది. ఇక 'యాక్షన్' చూపకపోతే, ఈ వ్యవస్థ పేరు 'కలెక్షన్ డిపార్ట్‌మెంట్'గానే చరిత్రలో మిగిలిపోతుంది...!

ఉపముఖ్యమంత్రిని కలిసిన సత్తయ్య

విశాలాంధ్ర - తుర్కయంజల్ : ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కని టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానం చేసి పాలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నల్గొండ డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టీజీ క్యాబ్ ఎండీ వై.కే. రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రిడ్ డిబి క్లౌడ్ ఐఓటి హ్యాకథాన్‌లో ఐఓటి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : తోషిబా సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి 2026 జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1 వరకు భారతదేశంలోని బెంగళూరులో జరిగే రెండు రోజుల వ్యక్తిగత ఈవెంట్ అయిన మొట్టమొదటి గ్రిడ్ డిబి క్లౌడ్ ఐఓటీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నట్లుగా తోషిబా డిజిటల్ సొల్యూషన్స్ కార్పొరేషన్ ప్రకటించింది. మైక్రోసాఫ్ట్ అజూర్ మార్కెట్‌ప్లేస్‌లో అందుబాటులో ఉన్న తోషిబా ఫుల్లీ మేనేజ్డ్ టైమ్ సిరీస్ డేటాబేస్ అయిన గ్రిడ్ డిబి క్లౌడ్‌ను ఉపయోగించి రియల్-టైమ్ ఐఓటీ అప్లికేషన్‌లను అభివృద్ధి చేసే సవాలును స్వీకరించాల్సిందిగా ఈ హ్యాకథాన్ స్టార్టప్‌లు, విద్యార్థులు, డెవలపర్లను ఆహ్వానిస్తోంది.ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన గ్రిడ్ డిబి క్లౌడ్ సామర్థ్యాలను ప్రోత్సహించ దానికి తోషిబా ఈ హ్యాకథాన్‌ను నిర్వహిస్తోంది. గ్రిడ్ డిబి క్లౌడ్ అనేది డిజిటల్ పరివర్తనకు ఒక ప్రధాన డేటా మౌలిక సదుపాయంగా పనిచేస్తుంది. సంస్థలు పెద్ద మొత్తంలో డేటాను సేకరించి విశ్లేషించడానికి, విలువైన ఇన్‌సైట్స్‌ను వెలికితీయడానికి, కొత్త వ్యాపార చొరవలను నడిపించడానికి వీలు కల్పిస్తుంది. వేగవంతమైన డేటా ఇంజెక్షన్, లో-లేటెన్సీ క్వెరీయింగ్, పటిష్ఠ విశ్వసనీయత అనేవి పరిశ్రమలలో రియల్-టైమ్ అనలి టిక్స్, మిషన్-క్రిటికల్ ఆపరేషన్లకు మద్దతు ఇవ్వడంలో దీనిని ప్రత్యేకంగా నిలబెడుతాయి. 2025 డిసెంబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం, దరఖాస్తు చేసుకోడానికి, దయచేసి ఛిీశీఅవగ్రిడ్ డిబి కౌల్డ్ ఐఓటి హ్యాకథాన్ అనే వెబ్సైట్ ను సందర్శించండి.

రిజర్వేషన్ సాధనలో బీఎస్పీ కీలక పాత్ర

విశాలాంధ్ర - తుర్కయంజల్ : ప్రస్తుతం ఉన్న 27% బీసీ రిజర్వేషన్స్ సాధించడంలో బీఎస్పీ పార్టీ కీలక పాత్ర పోషించిందనీ, ఎవరి జనాభా ఎంతో - వారి వాటా అంత అనే నినాదంతో దేశంలో పుట్టిన ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అనీ నేడు తెలంగాణ రాష్ట్రములో న్యాయమైన వాటా కోసం జరుగుతున్న 42% బీసీ రిజర్వేషన్స్ పోరాటానికి బీఎస్పీ పార్టీ పూర్తి మద్దత్తు ఉంటుందని బిఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బిఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో 42శాతం బీసీ రిజర్వేషన్స్ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం కోసం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్స్ 42 శాతం అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్స్ అమలు కోసం బీఎస్పీ పార్టీ చేసిన పోరాటాన్ని, బహుజన మహనీయుల రాజకీయ ఉద్దేశాన్ని మొత్తం సమాజానికి వివరించి చెప్పాలని బిఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షులు పట్నం రమేష్ మున్సిపాలిటీ బిఎస్పీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లపంగి రాజు, మాజీ అధ్యక్షులు పద్దిగళ్ల బాబు, కార్యదర్శి నెమలి సత్యనారాయణ, మాజీ కార్యదర్శి జంతుక సైదులు, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల రవి కుమార్ , ప్రవీణ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభం

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం 4వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని మాజీ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ శివ గౌడ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు యసారం మహేష్, కృష్ణ గౌడ్, బండి శ్రీనివాస్ మరియు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అజయ్ రెడ్డితో పాటు కాలనీ సభ్యులు పాల్గొన్నారు. వర్షాకాలంలోనూ పౌర సమస్యల పరిష్కారం పట్ల నాయకుల నిబద్ధత ప్రశంసనీయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, మాజీ మేయర్ అమర్ సింగ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పాఠశాల టాపర్లకు శ్రీరామ్ లైఫ్ అవార్డ్స్ స్కాలర్‌షిప్‌లు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి టాపర్లకు స్కాలర్‌షిప్‌లను ప్రదానం చేసింది. స్కాలర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు ఒకసారి రూ.30,000 స్కాలర్‌షిప్ లభిస్తుంది, రాష్ట్ర స్థాయిలో మొదటి ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇస్తారు. ఈ స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల ఇంటర్మీడియట్ చదువుల సమయంలో అయ్యే ఖర్చులకు పాక్షిక ఆర్థిక సహాయాన్ని అందిస్తాయని భావిస్తున్నారు. అర్హత ప్రమాణాల ప్రకారం, ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర బోర్డు పాఠశాలల విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులు. టాపర్ల జాబితాను తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ అందించింది. ఈ అవార్డు కార్యక్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసన వ్యవహారాల శాఖల మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు పాల్గొని, విజేత విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.ఆర్.సి. శేఖర్, ఎండీ, శ్రీరామ్ లైఫ్, ఆర్. దురువాసన్, డైరెక్టర్, మరియు శ్రీనివాస రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, శ్రీరామ్ లైఫ్ పాల్గొన్నారు. ఈ స్కాలర్‌షిప్ కార్యక్రమం శ్రీరామ్ లైఫ్ సంస్థ కొనసాగిస్తున్న సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు విద్యా సహాయం అందించాలనే కంపెనీ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. విలువ ఆధారిత విద్య యొక్క ప్రాధాన్యతను నొక్కి చెబుతూ, మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు, విద్యార్థులు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కోవాలని, తెలంగాణ రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ అవకాశా లను సద్వినియోగం చేసుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరచు కోవాలని సూచించారు. ఆయన విలువలు, క్రమశిక్షణ, మరియు నైపుణ్యం కలగలసిన విద్య మాత్రమే యువతకు దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

ఏపీఈపీడీసీఎల్‌కు రూ.10 కోట్ల నష్టం

ముఖ్యమంత్రికి సీఎండీ వివరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మొంథా తుపాను ప్రభావానికి దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. కోనసీమ జిల్లాలో బుధవారం పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విద్యుత్ పునరుద్ధరణ చర్యల పురోగతిని వివరించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్‌సాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి అవసరమైన సామగ్రిని ముందస్తుగానే అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పరిశీలిస్తూ, సిబ్బందికి అవసరమైన సూచనలను పృథ్వీతేజ్ అందించారు. అమలాపురం డివిజన్ పరిధిలోని ఉప్పలగుప్తం, ఐనవోలు, అమలాపురం సబ్‌స్టేషన్లను సందర్శించి, పునరుద్ధరణ పనులను సమీక్షించారు. కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సంస్థ పరిధిలోని 11 సర్కిళ్లలో రూ.10.47 కోట్ల నష్టం వచ్చినట్లు సీఎండీ తెలిపారు. 7,973 మంది 523 బృందాలుగా ఏర్పడి శ్రమిస్తున్నారన్నారు. కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి సర్కిళ్లలో ఎక్కువగా నష్టం జరిగిందని చెప్పారు. 13 టౌన్లకు 13, 67 మండలాలకు 67, 1,234 గ్రామాలకు 1,059, 13,56,415 సర్వీసు కనెక్షన్లకు 13,02,948, 33 కేవీ సబ్ స్టేషన్లు 255కు 255, 33 కేవీ ఫీడర్లు 192కి 192, 11కేవీ ఫీడర్లు 1,147కి 1,125, 33 కేవీ లైన్లు 5.43 కిలోమీటర్లకు 4.43, 11 కేవీ లైన్లు 76.1 కిలోమీటర్లకు 43.7, ఎల్‌టీ లైన్లు 45.6 కిలోమీటర్లు 29.8, 33 కేవీ స్తంభాలు 47కి 46, 11 కేవీ స్తంభాలు 1,128కి 806, ఎల్‌టీ స్తంభాలు 1,226కి 703, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 25,719కి 9,367, వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు 17,700కు 16,822 చొప్పున పునరుద్ధరించినట్లు సీఎండీ వెల్లడించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు గురువారానికి పూర్తి చేసేలా అన్ని బృందాలు సమష్టిగా కృషి చేస్తున్నాయన్నారు. విద్యుత్ అంతరాయాల సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం.1912కు, కంట్రోలు రూమ్- కార్పొరేట్ ఆఫీసు 8331018762, కాకినాడ 9490610856, పెద్దాపురం 9493178728, జగ్గంపేట 9490610097, అమలాపురం 9490610101, రామచంద్రపురం 9493178821, నరసాపురం 7382050943, నరసాపురం 9490610151, భీమవరం 9490610143తో పాటు సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి, పరిష్కారం పొందవచ్చని వినియోగదారులకు సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు.

సత్వరమే విద్యుత్ పునరుద్ధరణ

అధికారులకు లోకేశ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సచివాలయంలో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలతో రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురద తొలగించేందుకు అగ్నిమాపకశాఖ తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్ పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. వర్షాలకు దెబ్బతిన్న వివిధ పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు పంటనష్టం అంచనాలు రూపొందించాలన్నారు. వంతెనలు, కల్వర్టులను పర్యవేక్షించడంతో పాటు వర్షాల ధాటికి దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువగట్లను పటిష్టపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పాముకాటుకు ఉపయోగించే ఔషధాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం నిర్వహణతో పాటు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత, సీఎస్ కె.విజయానంద్, ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ తదితరులు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

త్వరితగతిన నష్టం అంచనాలు

మొంథా తుపానుపై ఆర్టీజీఎస్ కేంద్రంలో మూడో రోజు బుధవారం మంత్రి నారా లోకేష్ సమీక్ష జరిపారు. వివిధ జిల్లాల్లో మొంథా తుపాను తీవ్రత... ఇప్పటివరకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. తుపాను వల్ల కలిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలు త్వరితగతిన రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కోనసీమ, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందని అధికారులు వివరించారు. ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు.

అమరావతి రైతులకు నాలుగు నెలల్లో ప్లాట్లు

మంత్రి నారాయణ

విశాలాంధ్ర-సచివాలయం: రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. రాబోయే నాలుగు నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్లతో పాటు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అమరావతి విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని అన్నారు. అమరావతి కోసం భూసమీకరణ కింద మొత్తం 30,635 మంది రైతుల నుంచి 34,911.23 ఎకరాలను సీఆర్డీఏ ద్వారా తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. వీటిలో ఇప్పటి వరకు 29,644 మంది రైతులకు సంబంధించిన 34,192.19 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే 26,197 మంది రైతులకు సంబంధించిన 31,003.38 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 2,727 మంది రైతులకు సంబంధించిన 3188.81 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తయినట్లు తెలిపారు. ఇంకా 991 మంది రైతులకు సంబంధించిన 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం, లంక భూములు, కోర్టు కేసులు, పీవోటీ కేసులు, 12 సెంట్ల లోపు ఉన్న భూములు ఉన్నాయని చెప్పారు. ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగంగా జరుగుతుందన్నారు. మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందని మంత్రి నారాయణ వివరించారు. ఇంకా 2,501 మంది రైతులకు 8,441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీటిలో కోర్టు కేసులున్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1,170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందిన 1,889 ప్లాట్లు, పీఓటీ కేసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు, దేవదాయ శాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు, ఎన్ఆర్ఐలు 210 మందికి చెందిన 444 ప్లాట్లు ఉన్నాయన్నారు. ఆయా పెండింగ్ ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా ముందుకు వెళుతున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం రోజుకు 60 నుంచి 90 ప్లాట్ల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అన్నారు. రైతులకు చెల్లించే కౌలు పైనా మంత్రి స్పష్టత ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.231.03 కోట్ల నగదు చెల్లించగా, మరో 484 మంది రైతులకు రూ.3.15 కోట్లు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉందన్నారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు రూ.1.03 కోట్లు పెండింగ్‌లో ఉందని అన్నారు. కోర్టు కేసులతో పాటు చనిపోయిన వారికి సంబంధించిన వివాదాలతో పెండింగ్ ఉన్నట్లు మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

జగన్‌కు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్రమాస్తుల ఆరోపణల కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లండన్ పర్యటనపై సీబీఐ వేసిన పిటిషన్‌ను హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టు బుధవారం తోసిపుచ్చింది. తన పెద్ద కుమార్తెను చూసేందుకు జగన్ ఈ నెల 11న లండన్ వెళ్లిన విషయం తెలిసిందే. ఆ పర్యటనలో బెయిల్ షరతులను జగన్ ఉల్లంఘించారని, తన సొంత ఫోన్ నంబర్‌ను వెల్లడించలేదంటూ సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో మాజీ సీఎంకు మూడు సార్లు కాల్ చేశామని, ఆయన ఇచ్చిన నంబర్ పని చేయలేదని సీబీఐ తెలిపింది. కోర్టు విధించిన షరతులను జగన్ ఉల్లంఘించారంటూ సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. ఉద్దేశపూర్వకంగానే పని చేయని నంబర్ ఇచ్చారని సీబీఐ వాదనలు వినిపించింది. ఇకపై జగన్ విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని కోర్టును కోరింది. దీంతో అసలు జగన్ ఫోన్ వాడరని, గతంలోను తన సిబ్బంది ఫోన్ నంబర్లు ఇచ్చారని ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. రెండు పక్షాల వాదనలు విన్న నాంపల్లి సీబీఐ కోర్టు... సీబీఐ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 22న వాదనలు జరుగగా... కోర్టు తీర్పునిచ్చింది.

తెలుగు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం... 2023 సంవత్సరానికి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల పేరిట 10 మంది సాహిత్య ప్రముఖులను రూ.20,116 నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రం, శాలువాతో ఘనంగా సత్కరించింది. బుధవారం విశ్వవిద్యాలయంలోని డా.ఎన్‌టీఆర్ కళామందిరంలో నిర్వహించిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయినవేళ రెండు రాష్ట్రాలలో తెలుగు విశ్వవిద్యాలయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కావడం శుభసూచకమని, అవి ఆయా రాష్ట్రాలకు మాత్రమే పరిమితి కాకుండా విస్తృత దిశగా అడుగులు వేయాలని అన్నారు. త్వరలో రెండు రాష్ట్రాల తెలుగు విశ్వవిద్యాలయాల స్థిరచరాస్తుల భాగస్వామ్యం గురించి చర్చలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఏడాది కాలం పాటు తాను చేసిన ప్రశంసనీయమైన విజయాలను ప్రస్తావించారు. తెలుగు సాహిత్య ప్రక్రియలోని ఉత్తమ గ్రంథాలను సాధారణ పాఠకులు తమ లేఖల ద్వారా సిఫార్సు చేసిన గ్రంథాలను ఎంపిక కమిటీ పరిశీలించి, నిర్ణయించిన ఉత్తమ రచయితలకు సాహితీ పురస్కారాల పేరిట గౌరవిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ విభాగాధిపతి ఎస్.రమేష్ సుంకసారి మాట్లాడుతూ సాహితీ పురస్కార గ్రహీతలను ఆకాశవాణి ద్వారా ప్రజలకు పరిచయం చేయడానికి కృషి చేస్తానని, తెలుగు విశ్వవిద్యాలయంతో సంయుక్తంగా సాహితీ కార్యక్రమాలను రూపొందించడానికి అవకాశం కల్పించాలని కోరారు. తొలుత రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా విస్తరణ సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామ్మూర్తి వ్యవహరించారు. ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న రింగు రామ్మూర్తిని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఘనంగా సత్కరించారు. సాహితీ పురస్కార గ్రహీతలు విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రసంగించారు.

2023 సాహితీ పురస్కారాల గ్రహీతలు వీరే

ధర్మపురి వైభవం (పద్య కవిత) పొజ్జల నరహరిశర్మ, నేను యౌగిక కావ్యం (వచన కవిత) విశ్వర్షి వాసిలి, తెలంగాణ రుబాయిలు (గేయ కవిత) డా. ఏనుగు నరసింహారెడ్డి, చందమామ చెప్పిన కథలు (బాల సాహిత్యం) డా.ఎం.హరికిషన్, 'నా' నుంచి 'మన' వరకు (కథ) డా.టి.సంపత్ కుమార్, మాదిగ కొలువు (నవల) ఆచార్య పులికొండ సుబ్బాచారి, ద్విజ్ఞక్రం (సాహిత్య విమర్శ) ఆడెపు లక్ష్మీపతి, రచ్చబండ (నాటకం) రావుల పుల్లాచారి, మృత్యుంజయుడు (అనువాదం) డా. టి.సి.వసంత, తిరుపతి కథలు (వచన రచన) ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, స్వతంత్రత నుంచి స్వాతంత్ర్యానికి (రచయిత్రి ఉత్తమ గ్రంథం) డా.జంధ్యాల కనకదుర్గ తదితరులున్నారు.

మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా బి. అదితా స్వప్నను ... అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా బుధవారం నియమించారు. గతంలో అదితా స్వప్న బీహార్, పుదుచ్చేరి, అండమాన్ అండ్ నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా పనిచేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యం నాయకత్వాన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్ బాధ్యతను ఆమెకు అదనంగా అప్పగించారు. ఈ సందర్భంగా అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగించినందుకు అల్కా లాంబాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికత... నాయక త్వాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలం... బూత్ స్థాయిలో మహిళా కాంగ్రెస్ ఉనికిని విస్తరిం చడంపై దృష్టి పెడతామని, మహిళా నాయకులకు సాధికారత కల్పించడం, సంస్థాగత చట్రాన్ని బలోపేతం చేయడం రాజకీయాల్లో మహిళల సమాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కోసం అఖిల భారత మహిళా కాంగ్రెస్ తన ప్రయత్నాలను కొనసాగిస్తోందని అన్నారు.

అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎంవోయూ కుదిరిందని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ముంబైలో నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ఇండియా మారిటైమ్ వీక్-2025 నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీ స్టేట్ సెషన్ వేదికపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధ్వర్యంలో ఇన్ ల్యాండ్ వాటర్ వే అథారిటీ ఆఫ్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వ ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ ఒప్పందం రాష్ట్రంలో అంతర్గత జల మార్గాల అభివృద్ధికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని, సరుకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలో అంతర్గత జలమార్గాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలోని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా దాదాపు రూ.150 కోట్లకు పైగా ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ఈ ఎంవోయూ ద్వారా అంగీకారం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా కేంద్ర ప్రభుత్వం వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ నావిగేషనల్ ఎయిడ్‌లను అందించాల్సి ఉండగా... రివర్ క్రూయిజ్ టూరిజం ఆన్ షోర్ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం భూమిని అందించాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో జాతీయ జల మార్గాలలో రవాణాకు కేంద్రం సొంత నిధుల ద్వారా లేదా ఆసక్తిగల ఆపరేటర్‌తో పీపీపీ ఏర్పాటు చేయడంతో అవసరమైన ఫెయిర్‌వేను అందించాల్సి ఉండగా డ్రెడ్జింగ్ మెటీరియల్‌ను డంపింగ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన భూమిని చూపించాల్సి ఉందని తెలిపారు. నిబంధనల మేరకు అంతర్గత జల మార్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఓడల ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, విశాఖ పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే, ఏపీ ఎయిర్ పోర్టు అథారిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణాదిత్య, మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జడ్.శివప్రసాద్ ు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులకు అన్యాయం

8వ పే కమిషన్‌పై అమర్‌జిత్ కౌర్

న్యూదిల్లీ: వేతన సవరణ కోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరో రెండేళ్లు వేచి ఉండాలనడం అన్యాయమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ బుధవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం జరిగేలా వేతన సవరణ ప్రక్రియ వేగవంతంగా జరగాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం 8వ పే కమిషన్ ఎదుట సమర్పించే డిమాండ్ల కోసం ఉమ్మడి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు అమర్‌జిత్ కౌర్ సూచించారు. 8వ వేతన సవరణ గౌరవమైన, న్యాయమైన విధంగా జరిగేందుకు చేసే పోరాటంలో ఉద్యోగులకు, పింఛన్‌దారులకు ఏఐటీయూసీ ఎల్లప్పుడు తోడుగా నిలుస్తుందని అన్నారు. 'దిల్లీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఏర్పాటు కావాల్సిన 8వ కేంద్ర పే కమిషన్ పది నెలల ప్రతిష్ఠంభన తర్వాత బీహార్ ఎన్నికల సందర్భంగా కేంద్రం కసరత్తు మొదలు పెట్టింది. పే కమిషన్ ఏర్పాటు కోసం మంగళవారం నిర్ణయం తీసుకుంది. కమిషన్ చైర్‌పర్సన్, పార్ట్‌టైమ్ సభ్యుని ఎంపికకు మోదీ ప్రభుత్వానికి 10 నెలల సమయం పట్టింది. అయితే, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం కోసం కమిషన్‌కు 18 నెలల గడువు మంజూరైంది. అంటే 2027 సంవత్సరం మధ్యలోగానీ 8వ కేంద్ర పే కమిషన్ నివేదిక/సిఫార్సులు అందవు. ఈ లెక్కన వేతన సవరణ కోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మరో రెండు సంవత్సరాలు ఆగాలి. వారికి అన్యాయం' అని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు.

అభియోగాల నమోదులో జాప్యమెందుకు?

అన్ని కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేస్తాం: సుప్రీం

న్యూదిల్లీ: కొన్ని కేసుల్లో నిందితులు ఏళ్ల తరబడి జైళ్లలో ఉంటున్నాగానీ అభియోగాలు నమోదు కాకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అభియోగాల నమోదుకు సంవత్సరాల సమయం ఎందుకు పడుతోందని, ఇందుకు ఎదురయ్యే సవాళ్లు ఏమిటో చెప్పాలని కోరింది. దీనిని బట్టి దేశంలోని అన్ని కోర్టులకు మార్గదర్శకాలు చేస్తామని పేర్కొంది. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ జరిగేలా చూడాలని కింది కోర్టులకు న్యాయస్థానం బుధవారం స్పష్టంచేసింది. విచారణలో జాప్యాన్ని నివారించడం కోసం మార్గదర్శకాలు జారీ చేస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతానుద్దేశించి పేర్కొంది. కొత్త క్రిమినల్ చట్టాల ప్రకారం తొలి విచారణ 60 రోజుల్లోగా జరగాలని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అంజారియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 'ఏదేని వ్యవహారంలో చార్జిషీటు దాఖలు అనంతరం అభియోగాలు నమోదు ప్రక్రియ వేగంగా జరగాలని పేర్కొంది. ఇందుకు తన వంతు తోడ్పాటు అందిస్తానని కోర్టుకు మెహతా తెలిపారు. సహకారం అందించేలా అమికస్ క్యూరీ బాధ్యతలను సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రాను సుప్రీంకోర్టు అప్పగించింది. నిందితుడు రెండేళ్లుగా జైల్లో ఉన్నాగానీ కేసులో ఇంతవరకు అభియోగాలు నమోదు కాలేదని ఓ క్రిమినల్ కేసు విచారణ క్రమంలో పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ద్విసభ్య ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. అభియోగాల నమోదుకు సంవత్సరాల సమయం ఎందుకు? ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి? ఇలా జాప్యం జరగకుండా ఉండేందుకు దేశంలోని అన్ని కోర్టులకు తగు మార్గదర్శకాలు జారీ చేస్తామని ప్రతిపాదిస్తున్నాం' అని పేర్కొంది.

2న లండన్‌కు చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మళ్లీ విదేశీ పర్యటన చేయనున్నారు. ఏపీకి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా వరుస విదేశీ పర్యటనలు జరుపుతున్నారు. నవంబరు 2న లండన్ వెళ్లనున్నారు. ఈ పర్యటన షెడ్యూలు ఖరారైంది. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, పెట్టుబడులను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగానే ఒకపక్క సీఎం, మరోపక్క మంత్రి లోకేశ్ విదేశీ పర్యటనలు జరుపుతున్నారు. లండన్‌లో రోడ్డు షోతో పాటు అక్కడ నిర్వహించే సీఐఐ రోడ్డు షోలో సీఎం పాల్గొననున్నారు. లండన్ నుంచి నవంబర్ 6వ తేదీన సీఎం అమరావతికి తిరిగి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన ఈనెల 22, 23, 24 తేదీల్లో దుబాయి, అబుదాబీలో పర్యటించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర వేడుకగా సీపీ బ్రౌన్ జయంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన సీపీ బ్రౌన్ (చార్లెస్ ఫిలిప్ బ్రౌన్) జయంతి నవంబరు 10న ప్రతి సంవత్సరం రాష్ట్రోత్సవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. తెలుగు భాషా, సాహిత్య పునరుజ్జీవనానికి తన జీవితాన్నే అంకితం చేసిన సి.పి.బ్రౌన్ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు రూ.10 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. నవంబరు 23న శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగే ఈ వేడుకల కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల సందర్భంగా అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు ఈ నిధులను వినియోగించాలని ఏపీ టూరిజం అథారిటీ సీఈఓను ఆదేశించారు.

72 మంది మావోయిస్టుల లొంగుబాటు

బీజాపూర్‌లో 51 మంది, కాంకేర్‌లో 21 మంది

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్‌లో మొత్తం 72 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలో 51 మంది లొంగిపోగా, వారిలో 20 మందిపై రూ.66లక్షల రివార్డు ఉంది. కాంకేర్ జిల్లాలో మరో 21 మంది లొంగిపోయారు. 18 ఆయుధాలను అప్పగించారు. ఇందులో నాలుగు ఏకే 47 రైఫిళ్లు, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, పాయింట్ 303 రైఫిళ్లు ఐదు, పాయింట్ 315 బోరు రైఫిలు ఒకటి, సింగిల్ షాట్ రైఫిలు ఒకటి, రెండు బీజీఎల్ లాంచర్లు ఉన్నాయి. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు రివార్డు ఉన్నట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. బీజాపూర్‌లో లొంగిపోయిన వారిలో తొమ్మిది మంది మహిళలు ఉన్నట్లు జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) సభ్యులు ఐదుగురు, ఏరియా కమిటీలు, ప్లాటూన్ సభ్యులు ఏడుగురు, లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ (ఎల్‌ఓఎస్) సభ్యులు ముగ్గురు, 14 మంది మిలిషియా ప్లాటూన్ సభ్యులు, 20 మంది ఇతర సభ్యులు ఉన్నట్లు తెలిపారు. 2024 జనవరి నుంచి మొత్తం 650 మంది మావోయిస్టులు బీజాపూర్‌లో లొంగిపోయారని చెప్పారు. వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 196 మంది చనిపోయారని, మరో 986 మంది అరెస్టుకు గురయ్యారని ఎస్పీ వెల్లడించారు. ఇదిలావుంటే, కాంకేర్ జిల్లాలో మావోయిస్టు నిర్మూలన ప్రత్యేక అధికారి సుందర్ రాజ్, జిల్లా కలెక్టర్ నీలేష్ మహదేవ్, ఎస్పీ కల్యాణ్‌తో పాటు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్, అదనపు ఎస్పీ ఉలాండన్ యార్క్, డీఎస్పీలు వినీత్ సాహు, శరత్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.